## కౌంటింగ్ ఏజెంట్లపై వ్యాఖ్యలు

# సజ్జలపై క్రిమినల్ కేసు

అమరావతి: వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పై క్రిమినల్ కేసు నమోదైంది. కౌంటింగ్ ఏజెంట్ల విధుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆయనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. 153, 505, 125 సెక్షన్ల కింద సజ్జలపై కేసు పెట్టారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్ల అవగాహన సదస్సులో సజ్జల పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. మన టార్గెట్ ఇదీ అని దృష్టిలో పెట్టుకుని... దానికి అవసరమైనవి తెలుసుకోవాలి. అవతలివారు (ప్రత్యర్థి పార్టీలను ఉద్దేశించి) అడ్డం పడకుండా వారిని ఆపేందుకు ఏవేం నిబంధనలు ఉన్నాయో చూసుకోవాలి. మనది ఒక్క ఓటు కూడా చెల్లనిదిగా చేసే పరిస్థితి రాకుండా అడ్డుకునేందుకు ఏం చేయాలో చూసుకోవాలి. అంతే తప్ప రూల్ అలా ఉంది కాబట్టి దాని ప్రకారం పోదాం అని మనం కూర్చోకూడదు. మనకు అనుకూలంగా, అవతలివాళ్ల ఆటలు సాగకుండా రూల్‌ని ఎలా చూసుకోవాలి? అవసరమైతే దానికోసం ఎంతవరకు ఫైట్ చేయాలనేది నేర్చుకుందాం. ఇందులో కౌంటింగ్ ఏజెంట్ తనవంతు పాత్ర పోషించేలా వారి మెదడులోకి మీరు (చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు) బాగా ఎక్కించాలి. పొరపాటున ఒకటి మనం వాదించినా పర్లేదు. కానీ, రూల్ కాదేమో అని వెనక్కి తగ్గేవాడైతే ఏజెంట్‌గా వద్దు" అని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. దీనిపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోస్టల్ బ్యాలెట్లపై హైకోర్టు తీర్పు నేడు

అమరావతి: పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటుపై వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై హై కోర్టు శనివారం తీర్పు వెలువరించనుంది. పోస్టల్ బ్యాలెట్ పై గెజిటెడ్ స్టాంప్ లేకున్నా.. చెల్లుబాటు అవుతుందని ఈసీ ఇచ్చిన మెమోను సవాల్ చేస్తూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. దీనిపై శుక్రవారం వాదనలు పూర్తి కావటంతో ఏపీ హైకోర్టు తీర్పు శనివారానికి వాయిదా వేసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు పోస్టల్ బ్యాలెట్లపై తీర్పు వెలువరించనున్నట్లు హైకోర్టు పేర్కొంది. అప్పిరెడ్డి తరఫున అడ్వొకేట్ పన్నపురెడ్డి వివేక్ చంద్రశేఖర్ హైకోర్టులో వాదనలు వినిపించారు. అటు, ఎన్నికల సంఘం తరఫున సీనియర్ అడ్వొకేట్ అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు.

## ఓట్ల లెక్కింపు నియమాలను

# క్షుణ్ణంగా తెలుసుకోండి



- కౌంటింగ్ ఏజెంట్లు నియమాలను పట్టించుకోవద్దన్న వైసీపీ
- రూల్స్ ప్రకారమే లెక్కింపు జరిపించమన్న తెదేపా
- కేంద్ర కార్యాలయంలో లెక్కింపు శిక్షణ శిబిరం నిర్వహణ

అమరావతి: తమ కౌంటింగ్ ఏజెంట్లు పద్ధతి ప్రకారమే నడుచుకోవాలని స్పష్టం చేసిన తెలుగుదేశం పార్టీ ఒకవైపు.. నియమాలకు విరుద్ధంగా అడ్డగోలుగా వాదించి గందరగోళం సృష్టించేవారు మాత్రమే కౌంటింగు ఏజెట్లుగా ఉండాలన్న వైసీపీ మరోవైపు. దీంతో తమ గెలుపుపట్ల కూటమి పూర్తి ధీమాతో ఉన్నట్లు, ఓటమి భయంతో వైసీపీ దిగాలుపడ్డట్లు స్పష్టమవుతోంది.

175 శాసన సభ, 25లోక్‌సభ నియోజకవర్గాల ప్రధాన ఎన్నికల ఏజెంట్లకు శుక్రవారం తెదేపా తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఓట్ల లెక్కింపుపై వర్క్‌షాప్ నిర్వహించింది. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన పద్ధతులు, నియమాలపై ఈ శిబిరంలో పూర్తి అవగాహన కల్పించారు. అనవసర వాదోపవాదాలు, అడ్డంకులు సృష్టించడంతో ఎవరూ విజయం సాధించలేరని, ఎన్నికల సంఘం ఆదేశాలు, నియమాలు తూ.చ తప్పకుండా ఓట్ల లెక్కింపులో అమలయ్యేలా చూడాలని తెదేపా తమ ఎన్నికల ఏజెంట్లకు స్పష్టం చేసింది. అలా చేయాలంటే.. నియమాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని తెదేపా సీనియర్ నాయకులు సూచించారు.

కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, స్ట్రాంగ్‌రూంల నుంచి ఈవీఎం యంత్రాల్లోని కౌంటింగ్ యూనిట్లు, ఫారమ్ 17సిలను కౌంటింగ్ హాళ్లకు తరలించే ప్రక్రియ, రౌండ్లవారీ ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ యూనిట్లు, ఫారం 17సిలో నమోదైన ఓట్ల పరిశీలన, కౌంటింగ్ ఏజెంట్లు మరియు అధికారుల పాత్ర, లెక్కింపులో తప్పులు దొర్లకుండా చూసే విధానం, పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని అంశాలనూ కూలంకషంగా ఏజెంట్లకు వివరించారు.

ఈసీ నిబంధనల ప్రకారం చెల్లుబాటయ్యే ప్రతి ఓటూ లెక్కలోకి వచ్చేవిధంగా చూడాలని ఏజెంట్లకు సూచించారు. కౌంటింగ్ యూనిట్లపై ఉండే సీళ్లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలని చెప్పారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లమధ్య తేడా తక్కువగా ఉన్నపుడు అనుసరించాల్సిన పద్ధతులనూ వర్క్‌షాప్‌లో వివరించారు. అవసరాల మేరకు సహేతుక కారణాలతో మొదట రీకౌంటింగ్, రెండొవ రీకౌంటింగ్ అడగవచ్చని ఎన్నికల ఏజెంట్లకు వివరించారు. రెండు గంటలకు పైగా సాగిన శిక్షణ శిబిరం చాలా ఉపయోగకరంగా ఉన్నట్టు పలువురు ఏజెంట్లు అభిప్రాయపడ్డారు.




## ఎండలకు 54 మంది మృతి | ఉడుకుతున్న ఉత్తరాది

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా భానుడు భగభగమంటున్నాడు. మొన్నటికి మొన్న దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఆ ఉష్ణోగ్రతను దాటి శుక్రవారం మహారాష్ట్ర లోని నాగ్‌పూర్‌లో ఏకంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమో దైంది. వారం రోజులుగా ఉత్తరాదిన 50 డిగ్రీల సెల్సి యస్ దాటి రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ట్లు నివేదికలు వస్తున్నాయి. ఢిల్లీ, రాజస్థాన్, బీహార్, యూపీతోపాటు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వడదెబ్బ ధాటికి అనేకమంది పిట్టల్లా రాలిపోతున్నారు. గత 24 గంటల్లోనే దేశవ్యాప్తంగా 54మందికి పైగా చనిపోయినట్లు అంచనా.

నాగ్‌పూర్లో భారత వాతావరణ విభాగం నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో రెండింట గురువారం అసాధారణ ఉష్ణోగ్రతలు చూపించాయి. సోనేగావ్ లోని ఏడబ్ల్యూఎస్ స్టేషన్లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. ఉత్తర అంబాజరీ రోడ్డులోని ఐఎండీ కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44డిగ్రీల ఎండలు ఉన్నట్లు రికార్డయ్యింది.

ఇటీవల ఢిల్లీలోని ముంగేష్‌పుర్లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఢిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణశాఖ స్పందించింది. ఆ వాతావరణ స్టేషన్లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో తనిఖీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామాల వేళ ఇప్పుడు నాగ్‌పూర్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం మరోసారి చర్చకు దారి తీసింది. ఇక్కడా సెన్సార్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

### ఉసురుతీస్తున్న వడదెబ్బ.. 54 మంది మృతి

మరోవైపు తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడదెబ్బ కారణంగా దేశవ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా బీహార్ లో 32 మంది మృతి చెందగా.. ఒడిశాలో 10 మంది, ఝార్ఖండ్, రాజస్థాన్లో ఐదుగురు చొప్పున, ఉత్తరప్రదేశ్లో ఒకరు, ఢిల్లీలో ఒకరు మరణించారు.

బీహార్ లో అనేకచోట్ల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బక్సర్లో గురువారం 47.1 డిగ్రీలు నమోదయ్యింది. వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల వ్యవధిలోనే 32 మంది చనిపోయినట్లు అక్కడి విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది. వీరిలో 10 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపింది.

ఒడిశాలోనూ ఈ మరణాలు నమోదవుతున్నాయి. రూర్కెలాలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో 10 మంది చనిపోయినట్లు సమాచారం. దాదాపు 50 మంది బాధితుల్లో ఎనిమిది మంది ఆసుపత్రికి వచ్చేసరికే ప్రాణాలు కోల్పోయారని, మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారని అధికారులు వెల్లడించారు. పోస్టుమార్టం తర్వాత మరణాలకు గల కారణాలు తెలుస్తాయన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో పలుచోట్ల 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడదెబ్బ కారణంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

రాజస్థాన్లో అనేకచోట్ల 50 నుంచి 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో అనేక జిల్లాలకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ వేసవి సీజన్లో వడదెబ్బ కారణంగా దాదాపు 122 మంది చనిపోయినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నా యి. వీరిలో 61 మంది గత వారం రోజుల వ్యవధిలోనే మరణించినట్లు అంచనా. అయితే, వీటిలో ఎక్కువ భాగం మరణాలను ప్రభుత్వం అధికారికంగా గుర్తిం చడం లేదని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. పరి హారం చెల్లించకుండా తప్పించుకునేందుకే వీటిని దాచిపెడుతోందని మండిపడ్డాయి.

రానున్న రెండు రోజుల్లో యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వడగాలులు తీవ్రంగా ఉన్నందున దేశంలో జాతీయ ఎమర్జెన్సీని విధించే అవకాశాలను పరిశీలిం చాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది.

### రుతుపవనాల పైనే ఆశ..

మరోవైపు, దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం కాస్త ఊరటనిచ్చే విషయం. గురువారం కేరళ తీరాన్ని తాకిన ఈ రుతుపవనాలు.. ప్రస్తుతం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మిగతా ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది.



చైతన్యరథం

# చూపంతా.. ఎగ్జిట్‌పోల్స్‌వైపే!

- సాయంత్రం 6.30 తరువాత వెల్లడి
- నేటితో ముగుస్తున్న ఎన్నికల పోలింగు
- కేంద్రంలో నరేంద్రమోదీ హ్యాట్రిక్‌పై చర్చ
- చంద్రబాబు నాల్గవసారి సీఎంపైనా అమితాసక్తి
- పరువు కోసం ప్రాయోజిత సర్వేలకు వైసీపీ పాట్లు



అమరావతి (చైతన్యరథం): దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం,ఒడిషా రాష్ట్రాల అసెంబ్లీలకు ఏడుదశల్లో సాగిన ఎన్నికల పోలింగ్ నేటి సాయంత్రం ఆరు గంటలతో ముగియనుంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం ఫలితాలు జూన్ 2న,మిగిలిన ఎన్నికల ఫలితాలు జూన్ 4న అధికారికంగా వెల్లడవుతున్నా, చివరి విడత పోలింగ్ పూర్తైన అరగంట వ్యవధిలో ప్రఖ్యాత మీడియా సంస్థలు, చోటామోటా సర్వే సంస్థలు ప్రకటించబోయే ఎగ్జిట్ పోల్స్ కోసం దేశ, రాష్ట్ర ప్రజల్లో ఉత్కంఠ కనిపిస్తోంది. కేంద్రంలో అధికారంలో వున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ హ్యాట్రిక్ కొడుతుందా? లేక 30 ప్రతిపక్ష పార్టీలతో ఏర్పాటైన ఇండియా కూటమి అధికారంలోకి రానుందా? అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఇక రాష్ట్రంలో చోటుచేసుకున్న ప్రత్యేక రాజకీయ పరిణామాల్లో పాలకపక్షం వైసీపీ ఓటమిపై బలమైన అంచనాలే వినిపిస్తున్నాయి.జగన్విముక్త నవ్యాంధ్ర లక్ష్యంగా ఏర్పాటైన తెలుగుదేశం -జనసేన -బీజేపీల కూటమికి ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్ని స్థానాలు దక్కనున్నాయన్న ఆసక్తి ఎక్కువైంది. పోటెత్తిన పోలింగ్ సరళి, పాలకపక్షంపై రాష్ట్రవాసుల్లో పెల్లుబికిన వ్యతిరేకత, రాజధానిలేని రాష్ట్రం, అభివృద్ధికి దూరమైన వైనం.. నిరుద్యోగం.. ఇలా అనేక అంశాలు సార్వత్రిక ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్నే చూపాయి. పోలింగుకు ముందే పార్టీ ఓటమిపై వైసీపీ నిర్ధారణకు వచ్చేయడంతో.. ఎన్నికల హింసకు తెగబడిందన్న అపవాదూ పోలింగు రోజున జగన్ పార్టీ మూటగట్టుకుంది. ఈక్రమంలో ఎగ్జిట్ పోల్స్‌లో -వైసీపీకి అనుకూల వాతావరణం ఉండకపోవచ్చని..కూటమికి దక్కే భారీవిజయం ఎగ్జిట్ పోల్స్‌లో ప్రతిబింబించ వచ్చని చర్చించుకుంటున్నారు.

### ఎగ్జిట్ పోల్స్‌లోనూ వైసీపీ మోసాలు

ఎగ్జిట్ పోల్స్ విషయంలోనూ ఆంధ్రలో పాలకపక్ష వైసీపీ మోసానికి పాల్పడుతోందన్న చర్చ బలంగా వినిపిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విరుద్ధంగా వస్తే కౌంటింగ్ సమయానికి పార్టీ శ్రేణులు జారిపోవచ్చని, ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న అధికారులు ప్లేట్ ఫిరాయించొచ్చన్న భయం వైసీపీకి లేకపోలేదు. ఈ నేపథ్యంలో అటు జాతీయస్థాయిలో, ఇటు రాష్ట్రస్థాయిలో పనిచేస్తున్న సర్వే సంస్థలు కొన్నింటికి భారీ ప్యాకేజీలు ఇచ్చి.. వైసీపీకి అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ ఇచ్చేలా పార్టీ పెద్దలు ఒప్పందాలు చేసుకున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

### ఎగ్జిట్ పోల్స్ అంటే...?

సార్వత్రిక ఎన్నికలపై ఎన్నికల సంఘం అధికారికంగా ఫలితాలు వెల్లడించడానికి ముందు..కొన్ని మీడియా సంస్థలు, ఇతర సంస్థలు నిర్దుష్ట ప్రాతిపదికన జరిపిన అధ్యయనాల అంచనాలను వెల్లడించడమే ఎగ్జిట్‌పోల్స్. జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుంది? ఏ పార్టీకి ఆధిక్యం లభిస్తుంది? ఏ పార్టీ అధికారంలోకొచ్చే అవకాశముందీ? అన్న విషయాలను ఎగ్జిట్ పోల్స్‌తో తెలుసుకోవచ్చు. ఆధునిక సాంకేతికత, లోతైన అధ్యయన సూత్రీకరణలు అందుబాటులోకి వచ్చిన తరువాత.. కొన్ని సంస్థలైతే- ప్రాధాన్యత సంతరించుకున్న నియోజకవర్గాల్లో ఏ అభ్యర్థి గెలుస్తున్నాడు? ఎంత ఎంత మెజారిటీ సాధించబోతున్నాడు? అన్న విషయాలనూ చెబుతున్నాయి. దేశంలో చిట్టచివరి పోలింగ్ అంకం ముగిసిన అరగంట తరువాత ఎగ్జిట్ పోల్స్ వెల్లడించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఏ ప్రకారం తొలి విడత పోలింగు ప్రారంభమైన ఏప్రిల్ 19 ఉదయం 7నుంచి జూన్ 1 సాయంత్రం 6.30కు పోలింగ్ చివరి అంకం ముగిసే వరకూ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించొద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలే జారీ చేసింది. ఈసీ ఆదేశాలు ఉల్లంఘించిన వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం శిక్షార్హులు. అంటే.. భారీ జరిమానాలు లేదా 2 ఏళ్ల జైలు శిక్ష లేదా రెండూ విధించే అవకాశాలూ ఉంటాయి. దీంతో శనివారం సాయంత్రం 6.30 తరువాత ఎగ్జిట్ పోల్స్ ఇవ్వడానికి మీడియా, ఇతర సంస్థలు రంగం సిద్ధం చేసుకున్నాయి.

### ఎగ్జిట్ పోల్స్ నమ్మొచ్చా..?

పోలింగ్ పూర్తైన తర్వాత సర్వే ఏజెన్సీలు.. ఓటర్ల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు రూపొందిస్తారు. ముందే ఎంపిక చేసుకున్న పోలింగు కేంద్రాల్లో.. బూత్‌నుంచి బయటికొచ్చిన ఓటర్లకు నిర్వాహకులు నిర్దిష్టమైన ప్రశ్నలు వేస్తారు. వాళ్లిచ్చే సమాధానాన్ని బట్టి ఎక్కువమంది ఓటర్లు ఏ పార్టీకి ఓటు వేశారో లెక్కగడతారు. ఈ సమాచారం ఆధారంగానే పార్టీల ఓటింగ్ శాతం, గెలిచే సీట్ల సంఖ్యను ప్రత్యేక మెథడాలజీ(రాండమ్ స్ట్రాటిఫైడ్ శాంప్లింగ్)లో లెక్కలుగడతారు.

నిజానికి -ఎగ్జిట్ పోల్స్ ఖచ్చితత్వం గతంలో ఆయా ఎన్నికల్లో ఆయా సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఆధారపడి ఉంటుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పలు సంస్థలు ఎన్డీఏ కూటమికి 285 స్థానాలు వస్తాయని అంచనా వేశాయి. కానీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అంచనాలకు మించి విజయం సాధించి 353 స్థానాలను కైవసం చేసుకుంది. ఒక్క బీజేపీనే 303 స్థానాలను సొంతంగా సాధించింది. కాంగ్రెస్ 52స్థానాలకు పరిమితమైతే.. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి 91 స్థానాలే గెలుచుకుంది. అంతకుముందు -2014 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 257 నుంచి 340 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. అంచనాలకు తగ్గట్టే 336స్థానాలు సాధించడం.. ఖచ్చితత్వానికి నిదర్శనమైంది. 2004లో ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చెప్పాయి. అందుకు విరుద్ధంగా ఫలితాలొచ్చాయి. 2023లో తెలంగాణకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారాస విజయం ఖాయమంటూ కొన్ని సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించాయి. కానీ, అనూహ్యంగా కాంగ్రెస్ విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. ఎగ్జిట్ పోల్ అంచనాలు తుది ఫలితాలకు కనీసం 95 శాతం దగ్గరగా ఉంటే అంచనాల్లో కచ్చితత్వం ఉన్నట్టు భావించొచ్చు. కానీ చాలా సంస్థలు 60 శాతం దగ్గరకు రాలేకపోయినా.. తమ అంచనాలే నిజమయ్యాయని చెప్పుకోవడం కనిపిస్తోంది. సింపుల్‌గా చెప్పాలంటే.. ఎగ్జిట్‌పోల్ అంచనాలు కూడా వాతావరణశాఖ అంచనాల మాదిరే. కొన్నిసార్లు చాలా కచ్చితంగా, కొన్నిసార్లు దగ్గరగా, కొన్నిసార్లు విరుద్ధంగా ఉండొచ్చంటున్నారు నిపుణులు. అయితే - ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చిన తరువాత.. గత కొన్నేళ్లుగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు, ఫైనల్ ఫలితాలు దాదాపు సమానంగా ఉంటున్నాయని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

### ఎగ్జిట్ పోల్స్ ఎలా మొదలైంది?

భారత దేశంలో 1957 నుంచీ ఎగ్జిట్ పోల్స్ మొదలయ్యాయి. దేశవ్యాప్తంగా 20 వేలనుంచి 30 వేలమంది ఓటర్లను శాంపిల్‌గా తీసుకుని సర్వే చేసేవారని ఢిల్లీలోని సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్- సీఎస్‌డీఎస్‌కు చెందిన సంజయ్ కుమార్ వెల్లడించారు. దేశంలో నిర్వహించిన రెండో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 1957లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్.. పోస్ట్ పోల్ సర్వే నిర్వహించింది. తర్వాత 1980లో డాక్టర్ ప్రణయ్‌రాయ్ తొలిసారిగా ఎగ్జిట్ పోల్ నిర్వహించారు. ఆ 1984 ఎన్నికల్లోనూ ఆయన మళ్లీ ఎగ్జిట్ పోల్ చేపట్టారు. ఇక 1996లో దేశవ్యాప్తంగా ఎగ్జిట్ పోల్ నిర్వహించేందుకు.. ప్రభుత్వ ప్రసార సంస్థ దూరదర్శన్.. సీఎస్‌డీఎస్‌ను నియమించింది. అది మొదలు పలు సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తున్నాయి. దేశంలో సీ-వోటర్, యాక్సిస్ మై ఇండియా, సీఎన్ఎక్స్ తదితర సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ప్రకటిస్తున్న వాటిలో ప్రధానమైనవి. ఇందులో కొన్ని సంస్థలు మీడియాతో జతకట్టి ఎగ్జిట్ పోల్స్ వెలువరిస్తున్న విధానమూ నడుస్తోంది. ఎన్నికల సమయంలో ఎప్పటికప్పుడు కొన్ని కొత్త కొత్త ఏజెన్సీలూ పుట్టుకొస్తున్నాయి.

---

## మద్యం ఆదాయంపైనా అప్పులు తెచ్చారు: పురందేశ్వరి

- *రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీజేపీ బృందం*
- *రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు కోరుతూ గవర్నర్‌కు వినతి*

అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి శుక్రవారం రాజ్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో పురందేశ్వరి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వివరాలు కోరుతూ... గవర్నర్‌కు 13అంశాలతో వినతిపత్రం అందించినట్టు వెల్లడించారు. కార్పొరేషన్ల ఏర్పాటుచేసి అడ్డగోలుగా అప్పులు తెచ్చారని వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి పథకం కింద వచ్చిన నిధులను దారిమళ్లించారని అన్నారు. గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించలేదని తెలిపారు. ఆఖరికి, మద్యం అమ్మకాలపై భవిష్యత్‌లో వచ్చే ఆదాయాన్ని కూడా చూపి అప్పులు చేశారని పురందేశ్వరి ఆరోపించారు. ఆర్బీఐ జాబితాలో పేర్కొన్న ప్రకారం ఏపీ ప్రభుత్వం తీసుకువచ్చిన అప్పులు, ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన అప్పులు, కార్పొరేషన్ల ద్వారా తీసుకువచ్చిన అప్పులు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు, చెల్లించిన బిల్లులు... ప్రభుత్వ ఉద్యోగుల పీఎఫ్, ఇతర ఆర్థిక సంస్థల నుంచి తెచ్చిన అప్పుల వివరాలు, ప్రభుత్వ ఉద్యోగులకు టీఏ, డీఏ బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న కేసులు... తదితర వివరాలు అందించేలా రాష్ట్ర సీఎస్‌ను నిర్దేశించాలని గవర్నర్‌ను కోరామన్నారు. పురందేశ్వరితో పాటు ఇతర బీజేపీ నేతలు సాధినేని యామినీ చౌదరి, కాపు రామచంద్రారెడ్డి, పాతూరి నాగభూషణం, చిత్ర శివన్నారాయణ కూడా గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

---

## భూములు ఇవ్వాలని స్వయంగా సీఎస్సే వచ్చి అడిగారు



- ప్రాణం పోయినా ఇచ్చేది లేదన్నాం
- బెదిరించి లాక్కోవాలని చూస్తున్నారు
- మా భూముల్లో దౌర్జన్యంగా రాళ్లు పాతుతున్నారు
- విశాఖలో బాధిత రైతుల ఆవేదన

విశాఖపట్నం: సంచలనం సృష్టిస్తున్న విశాఖ భూ కుంభకోణంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) జవహర్‌రెడ్డి పాత్రను బాధితులు నిర్ధారించారు. సీఎస్ జవహర్‌రెడ్డి స్వయంగా వచ్చి తమ భూములను పరిశీలించి, ఇవ్వాలని అడిగినట్లు విశాఖ ప్రాంతానికి చెందిన పలువురు అసైన్డ్ రైతులు తెలిపారు. విశాఖకు చెందిన పలువురు భూకబ్జా బాధితులతో తెదేపా, జనసేన నేతలు శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సీఎస్ తమ భూములను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంలో ఈభూములను 40ఏళ్లుగా సాగుచేసుకుంటున్నట్లు చెప్పామన్నారు. చావనైనా చస్తామని.. భూములు మాత్రం ఇవ్వబోమని తేల్చిచెప్పామన్నారు. అల్లరి మూకలను ఉసిగొల్పి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని.. తమకు తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చిన భూముల్లో రాళ్లు పాతుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు లాక్కో వడంలో సీఎస్ జవహర్‌రెడ్డి హస్తం ఉందని భావిస్తున్నామన్నారు.

### సీఎస్ ఆదేశాల మేరకే.. పీతల మూర్తియాదవ్

భూములు ఇవ్వబోమంటూ స్థానికులు పోరాడా రని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. సీఎస్ ఆదేశాల మేరకే రైతుల పొలాల్లో అధికారులు రాళ్లు పాతారని ఆరోపించారు. భూములను పరిశీలించేందుకు సీఎస్ జవహర్‌రెడ్డి స్వయంగా వచ్చారని రైతులు చెబుతున్నారు. పేదల భూములు కొట్టేసేందుకు వైకాపా రాబందులు వస్తున్నాయి.

జీవో నంబర్ 596ను అడ్డుపెట్టుకుని భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులను భయపెట్టి భూములను కాజేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తమ భూములను ఇతరుల పేరిట రాయించుకున్న విషయం కూడా తెలియదు. రికార్డుల పరిశీలనకు అవకాశం లేకుండా వెబ్‌సైట్‌ను మూసేశారు. అది ఓపెన్ చేస్తే భూములు ఎవరి పేరుతో ఉన్నాయో పరిశీలించవచ్చు. పోరాటానికి రైతులు ముందుకు రావడం అభినందనీయం. రైతుల గోడును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైతే ఈసీ, కోర్టుకూ వెళ్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు న్యాయం చేస్తుందని మూర్తియాదవ్ తెలిపారు.

చైతన్యరథం

# పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీకి భయమెందుకు?

## - నిలదీసిన ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి(చైతన్యరథం): పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీ నేతలు ఎందుకు అంతగా భయపడుతున్నారో అర్థం కావడంలేదని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్లపై వైసీపీ అనవసర రాద్ధాంతం సృష్టిస్తూ, మోసపూరిత ప్రకటనలు చేస్తోందన్నారు. పోస్టల్‌బ్యాలెట్ చెల్లుబాటుకు సంబంధించి స్పష్టత ఇస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) ఇచ్చిన మెమోపై వైసీపీ నేతలు హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. దీనిని ఉపసంహరించుకునే పరిస్థితి వచ్చినప్పటికీ నిస్సిగ్గుగా సీఈఓపై విషం చిమ్ముతున్నారు. సీఈఓ చెప్పిన దానినే కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఒక సర్క్యులర్‌లో స్పష్టం చేయటంతో తొలుత సీఈఓ ఇచ్చిన మెమోను వెనక్కు తీసుకుంటున్నట్టు కోర్టుకు తెలిపారు. ఇందులో వాస్తవాలు దాచేసి సీఈఓ మెమో వెనక్కు తీసుకోవటాన్ని హైలైట్ చేస్తూ, పెద్ద విజయం సాధించినట్లుగా వైసీపీ నేతలు చెప్పుకుంటున్నారని అశోక్‌బాబు తప్పుబట్టారు.

తెలుగుదేశంపార్టీకి అనుకూలంగా సీఈఓ నిర్ణయం తీసుకున్నట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై అనుమానాలున్నా, మార్పులు చేర్పులు చేయాలన్నా టీడీపీ నేతలు మొదటినుంచీ సీఈఓను కలుస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై కొన్ని చోట్ల స్టాంపులు, సీళ్లు వేయలేదని ఈ సందర్భంగా మేము ఆయన దృష్టికి తీసుకెళ్లాము. పోస్టల్ బ్యాలెట్ వెనుక కొన్ని చోట్ల ఆర్ఓ సంతకం లేదు. కేంద్ర ఎన్నికల కమిషనర్ సర్క్యులర్ ప్రకారం వాటిని వ్యాలిడ్ ఓట్లుగా పరిగణించాలి. ఈ నిబంధన గతంలోనే ఉన్నప్పటికి కూడా ప్రస్తుత అధికారులకు మళ్లీ స్పష్టంగా సర్క్యులర్ ఇస్తే తప్ప పరిస్థితి చక్కబడదు. లేకుంటే పోస్టల్ బ్యాలెట్ పని చేయకుండా పోయే పరిస్థితి ఉందని సీఈఓ దృష్టికి మేము తీసుకువెళ్లాము. దీంతో పోస్టల్ బ్యాలెట్స్ విషయంలో గతంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను యథాతథంగా వివరిస్తూ ఆయన తాజాగా మెమో ఇచ్చారు. దానిపై వైసీపీ నేతలు గగ్గోలు పెడుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే సడలింపులు ఇచ్చారంటూ అనవసర



రాద్ధాంతం చేస్తున్నారు. నీలిమీడియాలో దుష్ప్రచారాన్ని హోరెత్తించారు. వాస్తవానికి సీఈఓ సడలింపులు ఇవ్వలేదు. ఉన్న నిబంధనలపై స్పష్టత మాత్రమే ఇచ్చారు. తన సొంత నిర్ణయాలేమీ లేవని, కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిన మేరకు చేశానని సీఈఓ చెప్పారు. వైసీపీ నేతలు హైకోర్టులో దీనిపై కేసు వేశారు. కేసు వేసిన వెంటనే కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఏపీ సీఈఓ లేఖ రాసి దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం చాలా స్పష్టంగా.. అటెస్టేషన్ ఫారమ్ 13 మీద అటెస్టేషన్ ఆఫీసర్ సంతకం పెట్టి సీలు, స్టాంప్ వేయకపోయినా ఆ బ్యాలెట్‌ని తిరస్కరించడా నికి వీలు లేదు, వాటన్నింటిని లెక్కింపులోకి తీసుకోవా లని తెలుపుతూ సీఈఓకు లేఖ రాసింది. ఆ లేఖను సీఈఓ కోర్టుకు సమర్పించటంతో వైసీపీ నేతలు కంగు తిన్నారు. దీంతో సీఈఓ ఇచ్చిన మెమోపై దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని, కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ మరో పిటిషన్ దాఖలు చేస్తామని వైసీపీ నేతలు అడగటంతో కోర్టు అంగీకరించింది. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఈఓ నిర్ణయమే చట్టబద్ధంగా నిలబడుతుంది. వైసీపీవారి కుటిల ప్రయత్నాలు కచ్చితంగా వికటిస్తాయని అశోక్‌బాబు స్పష్టం చేశారు.

# పోరాడి సాధించిన ఏబీవీ!

- పదవిలో చేరాకే రిటైరైన యోధుడు
- కక్షగట్టిన జగన్‌ను ఎదిరించి ఐదేళ్లుగా పోరాటం
- పోస్టింగ్ ఇవ్వకుండానే పంపించేందుకు ప్రభుత్వం కుట్ర
- బాధ్యతలు చేపట్టి సగౌరవంగా పదవీ విరమణ
- పదవికే విరమణ.. పోరాటానికి కాదని స్పష్టీకరణ



అమరావతి(చైతన్యరథం): పోరాట యోధుడు, డీజీ స్థాయి అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చివరికి సాధించారు. ఐదేళ్ల సుదీర్ఘ పోరాటం.. వ్యవస్థలతో కొట్లాటలో గెలిచారు. కక్షగట్టిన పాలకుడు జగన్‌కు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీవీ చివరకు బాధ్యతలు చేపట్టిన తరువాతనే సగౌరవంగా పదవీ విరమణచేశారు. ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండానే సర్వీసునుండి పంపించేందుకు జగన్ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. దీనిపై ఆయన ఎక్కని కోర్టు మెట్లు లేవు. క్యాట్ నుండి సుప్రీంకోర్టు వరకు జగన్ సర్కార్ కక్షసాధింపులపై పోరాడారు. చివరకు గెలిచారు. అన్ని అడ్డంకులనూ అధిగమించి సర్వీసులో చివరి రోజైన శుక్రవారం ఉదయం విజయవాడ ముత్యాలంపాడులోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ ప్రాంతీయ కార్యాలయంలో బాధ్యతలుచేపట్టిన ఏబీవీ... సాయంత్రానికి పదవీ విరమణచేశారు.

గత ఐదేళ్లుగా జగన్ సర్కార్‌పై ప్రతిపక్ష పార్టీలది ఒకరమైన పోరాటం అయితే ఏబీవీది మరోరకమైన పోరాటం. జగన్ సీఎం కాగానే ఏబీవీపై కక్షసాధింపులు మొదలయ్యాయి. డైరెక్టర్ జనరల్ ర్యాంక్ కలిగిన ఆయనకు ఐదేళ్లుగా పోస్టింగ్ ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం సస్పెన్షన్ల మీద సస్పెన్షన్లు విధించింది. అక్రమ కేసులతో జగన్ ప్రభుత్వం, వైకాపా వీరభక్త అధికార గణం వేధించింది. జగన్ అధికారంలోకి వచ్చాక రక్షణ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేయించారు. దీనిపై ఏబీవీ.. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను (సీఏటీ) ఆశ్రయించగా సస్పెన్షన్‌ను సమర్థించింది. అనంతరం ఆయన హైకోర్టుకు వెళ్లగా.. ఉన్నత న్యాయస్థానం సస్పెన్షన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సర్వీసులో ఉన్న అధికారిని రెండేళ్లకంటే ఎక్కువ కాలం సస్పెన్షన్లో ఉంచొద్దని ఆదేశిస్తూ.. ఏబీ వెంకటేశ్వరరావుపై ఉన్న సస్పెన్షన్‌ను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావుకు రెండేళ్ల క్రితం పోస్టింగ్ ఇచ్చింది. ఆ తర్వాత కొద్ది రోజులకే గతంలో ఏ కారణంతో సస్పెండ్ చేశారో.. తిరిగి అదే కారణంతో మరోసారి సస్పెండ్ చేసింది. దీనిపై ఏబీవీ మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. ఏబీవీ సస్పెన్షన్ చెల్లదని, ఆయన్ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని క్యాట్ ఈ నెల 8న ఆదేశాలిచ్చింది. ఈ నెల 31న ఏబీవీ పదవీ విరమణ చేయాల్సి ఉండగా, పోస్టింగ్‌పై ప్రభుత్వం తాత్సారం చేసింది. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ ఆదేశాల నిలుపుదలకు నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు గురువారం ఉత్తర్వులిచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సీఎస్ జవహర్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలోనూ స్వయంగా ఏబీ వెంకటేశ్వరరావే అందజేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఆయనను సర్వీసులోకి తీసుకుంటూ శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి, సాయంత్రం విజయవాడ ముత్యాలంపాడులోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయంలో పదవీ విరమణ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన రోజే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఇదే ఆఫీసులో ఛార్జ్ తీసుకుంటున్నా. నాకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు. ఇవాళ నా పదవీ విరమణ రోజు.. ఈ రోజే పోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నా. సాయంత్రం పదవీ విరమణ చేసే అవకాశం నాకు మాత్రమే వచ్చింది. కారణాలు ఏమైనా ఆల్ ఈజ్ వెల్ అని భావిస్తున్నా. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా.. ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు. పోస్టింగ్ ఆర్డర్లు వచ్చాయి.. విధుల్లో చేరాను. ఇప్పటికి ఇంత వరకు మాత్రమే మాట్లాడాలి. ఇంతకాలం నాకు అండగా ఉండి ధైర్యం చెప్పిన మిత్రులు, శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటాను. నా కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యావాదాలు. యూనిఫాంతో పదవీ విరమణ చేయడంతో నా కల నెర వేరినట్లుగా భావిస్తున్నా అని ఏబీవీ తెలిపారు.

జగన్ ఎవరిపైనైనా కక్షగడితే అది ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకునేందుకు ఏబీ వేంకటేశ్వరరావు ఒక ప్రత్యక్ష నిదర్శనంగా ఉన్నారని పలువురు అభిప్రాయపడ్డారు. పోలీసుశాఖలో డైరెక్టర్ జనరల్ హోదాలో ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు డీజీపీ కాకుండానే రిటైర్ అయ్యారు. ఆయన అభిమానులు, ఉద్యోగులు భారీగా తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. ఐపీఎస్ అధికారిగా ఆయన చేసిన సేవలు, ధైర్య సాహసాలను పలువురు కొనియాడారు. సీనియర్ ఐపీఎస్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఐఏఎస్ అధికారి చెరుకూరి శ్రీధర్, తెదేపా నేత పట్టాభి, అమరావతి ఐకాస నేతలు సహా పలువురు ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు ఏబీవీని కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసిన ఆత్మీయులను హత్తుకున్న ఏబీవీ.. ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. పోలీసు యూనిఫాంతో ఉన్న ఏబీవీ ఫొటోపై ఫైటర్ అని రాసిన ప్రకార్డులను ఆయన అభిమానులు ప్రదర్శించారు.

పదవీ విరమణ అనంతరం ఏబీవీ మాట్లాడుతూ తాను ఇంజినీరింగ్ చదువుకుని తొలుత టాటా మోటార్స్‌లో ఉద్యోగం చేశానన్నారు. అదే సంస్థలోలో ఉన్నా.. లేక అమెరికా వెళ్లినా.. ఇప్పుడు నా జీవితం వేరే విధంగా ఉండేది. ఐపీఎస్‌గా అధర్మాన్ని, అన్యాయాన్ని, అణచివేతను ఎదుర్కోవడం నా వృత్తిధర్మంగా పనిచేశాను. నా సర్వీసులో చట్టాన్ని కాపాడేందేందుకు అక్రమాలను, అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు పాటుపడ్డాను. అన్యాయాన్ని ఎదుర్కొన్నా తప్పితే నేను ఎవరికీ అన్యాయం చేయలేదు. నేను ఈ రోజు పూర్తి సంతృప్తితో రిటైర్ అవుతున్నాను. నా సర్వీసులో నీతి నిజాయితీతో వ్యవహరించాను. ఎవరికీ అన్యాయం చేయకపోవడంతోనే ఈరోజు నేను లక్షల మంది అభిమానం పొందాను. నాకు ఎదురైన సవాళ్లు, కష్టాలు చూసి నా అభిమానులు ఉద్వేగ్వంతో ఏడ్చారు. నా నిజాయితీ, ధర్మం, పోరాటమే నన్ను కాపాడింది. నా సర్వీసులో దుర్మార్గులనూ చూశా.. అదే సమయంలో నాకు వ్యతిరేకంగా వ్యవహరించాలని ఎంత డబ్బు ఆశ చూపినా కొందరు అధికారులు అంగీకరించలేదు. నాకు అండగా నిలిచిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. రిటైర్ అయినా నా జీవితం ఉన్నంతవరకు ప్రజా సేవలో ఉంటాను. నా శేష జీవితంలోనూ అన్యాయాన్ని, అణచివేతను ఎదురిస్తా. దుష్ట శిక్షణ-శిష్టరక్షణ చేసేందుకు నా రిటైర్డ్ జీవితంలో అవకాశం వస్తుందని ఆశిస్తున్నా. నాకు అప్తులుగా ఉండి అండగా ఉన్న వారికి రుణపడి ఉంటానన్నారు.



చైతన్యరథం

పుణ్యభూమి నా దేశం నమో నమామి

## సంపాదకీయం

### ఆఖరి అంకం!

[illegible]

# ఖరీఫ్‌కు ప్రణాళికేదీ!?

**ఈ ఏడాది ముందుగానే నైరుతి మోసుకొచ్చిన తీపి కబురు గత ఏడాది విపత్తులతో నష్టాలు చవిచూసిన రైతుల్లో కొత్త ఆశలు చిగురింపజేసింది. ఖరీఫ్ సజావుగా సాగాలంటే రైతులకు అదనుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండాలి. అందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి. కానీ ఖరీఫ్‌పై ఇప్పటి వరకు సమగ్ర సమీక్ష, సన్నద్ధత లేదు. సబ్సిడీ విత్తనాల పంపిణీ మొదలు కాలేదు. ఎరువులపైనా ఉదాసీనతే. పురుగు మందుల పరిస్థితి అదే తీరు. రైతు భరోసా కేంద్రాల ఉత్తుత్తి ప్రగల్భాలు వినిపిస్తున్నాయి. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న సమయంలో రుతుపవనాలు అనుకూలించడంతో రైతులు గంపెడు ఆశలు పెట్టుకొన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటివారంలోనే రాష్ట్రాన్ని పలకరించడం పెద్ద ఊరట. వ్యవసాయ ఆధారిత ఆంధ్రలో ఖరీఫ్‌లోనే 70 శాతం భూమి సాగయ్యే అవకాశముంది. కోటి ఎకరాలు, కోటిమందికి పైగా రైతులు, కౌలు రైతులు, అంతే సంఖ్యలో వ్యవసాయ కార్మికులకు జీవనాధారం ఖరీఫ్. రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ఖరీఫే ఆధారం. గత ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యమవడంతో కరువు బారిన పడింది రైతాంగం. ఈ ఏడాది పసిఫిక్‌లో లానినా పరిస్థితుల వలన అధిక వర్షం కురుస్తుందన్న వాతావరణ శాఖ సూచనలు కర్షకులకు ఊరట. గత ఖరీఫ్‌లో 86 లక్షల ఎకరాల్లో పంటలు సాగకావాల్సి ఉండగా 60.22 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం ఖరీఫ్ విస్తీర్ణం 27 శాతం తగ్గినట్లు సమాచారం. రాష్ట్రంలో 679 మండలాలకు ఖరీఫ్ సీజన్ ముగిసే సమయానికి 400 మండలాలు కరువు కోరల్లో చిక్కుకుంటే ప్రభుత్వం మాత్రం 103 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. రబీలోనూ అనావృష్టి కొనసాగగా, ఎన్నికల షెడ్యూల్ హడావుడిలో 87 కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకొన్నారు జగన్. [illegible] డిసెంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాన్ రైతులకు శాపమైంది.

-నీరుకొండ ప్రసాద్

ఈ ఏడాది ముందుగా నైరుతి మోసుకొచ్చిన తీపి కబురు గత ఏడాది విపత్తులతో నష్టాలు చవిచూసిన రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఖరీఫ్ సజావుగా సాగాలంటే రైతులకు అదనుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండాలి. అందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి. కానీ ఖరీఫ్‌పై ఇప్పటి వరకు సమగ్ర సమీక్ష, సన్నద్ధత లేదు. సబ్సిడీ విత్తనాల పంపిణీ మొదలు కాలేదు. ఎరువులపైనా ఉదాసీనతే. పురుగు మందుల పరిస్థితి అదే తీరు. రైతు భరోసా కేంద్రాల ఉత్తుత్తి ప్రగల్భాలు వినిపిస్తున్నాయి. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నకిలీ పత్తి, మిర్చి విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదతో మరింత ఆందోళన చెందుతున్నారు రైతులు.

గత ఏడాది ఖరీఫ్‌లో కరువు, తుపాన్‌తో పంట నష్టపోయిన 12 లక్షలమంది రైతులకు రూ.1,294 కోట్లు విడుదల చేస్తూ ఎన్నికల కోడ్ రావడంతో మార్చి 6న సీఎం బటన్ నొక్కగా ఇప్పటికీ ఖాతాల్లో జమ కాలేదు. [illegible] ఎన్నికల కోడ్ ముగిసే వరకు రైతులకు అందించాల్సిన ఆసరాలు అందించకుంటే గడిచిన కాలం తిరిగొస్తుందా? ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. అది నడుస్తూనే ఉండాలి.

ఎన్నికైన ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ప్రాధాన్యాలు మారుతుంటాయి. [illegible] కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇతర అంశాలు నిర్ణయమవుతాయి.

**జగన్ జమానాలో రైతులకు చేసిన సాయంకంటే ప్రచార [illegible] ఎక్కువ. [illegible] నాసిరకం ఎరువులు, ఎగబాకిన ధరలు, దిగజారిన దిగుబడి, పెరిగిపోతున్న రైతుల అప్పులు, పంట విరామం, [illegible] సాగుకు పెట్టుబడి విపరీతంగా పెరిగింది. ఎరువుల ధరలు, పురుగు మందుల ధరలు, పెట్రోలు, డీజిల్, ట్రాక్టర్ కిరాయిలు, కూలీల ధరలు సమస్తం పెరిగాయి. [illegible] రైతులు క్రాప్ హాలిడే ప్రకటించి సాగుకు దూరమవుతున్నారు.**

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వేళ రైతుల అవసరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గమనంలోకి తీసుకొని సమీక్షలు జరిపి ఖరీఫ్‌కు యావత్ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి. [illegible]

సీఎం జగన్‌రెడ్డి తన అసమర్థత, అనుచిత విధానాలతో వ్యవసాయరంగం వెన్ను విరిచారు. [illegible]

## మాటకు మాట



**జగన్ తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్లేనా..?! మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నల వర్షం**



[illegible]

చైతన్యరథం

# అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

**- రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నేతల ఫిర్యాదు**



**అమరావతి (చైతన్యరథం):** పల్నాడు జిల్లా ఎన్నికల విధుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ అక్రమాలకు పాల్పడిన విజయభాస్కర్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డిలపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ముకేష్ కుమార్ మీనాకు టీడీపీ సీనియర్ నేత మన్నవ సుబ్బారావు, టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ గూడపాటి లక్ష్మీనారాయణ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ... 'పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వినాయక్‌రెడ్డి, పుడా డిప్యూటీ ఛైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల విధుల నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. ఈ ముగ్గురు అధికారులు కౌంటింగ్ సిబ్బందిని నియమించడం, ఇతర అనుమతులు, తదితర విషయాల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. డీపీవోగా పనిచేస్తున్న విజయభాస్కర్ రెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్ మరియు వెబ్ క్యాస్టింగ్ పర్యవేక్షణ అధికారిగా నియమించారు. వీరు సుదీర్ఘ కాలంగా పల్నాడు ప్రాంతంలో పనిచేస్తున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిఫార్సుల మేరకు వీరిని ఎన్నికల విధుల్లో అత్యంత కీలకమైన పోస్టుల్లో నియమించారు. ఈ సమాచారాన్ని ఏప్రిల్ 15వ తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది. సదరు ఫిర్యాదుపై విచారణ కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ కి పంపించారు. విచారణ అధికారిగా డీఆర్ వో వినాయక్ రెడ్డిని నియమించారు. కేసును నీరుగార్చడానికే వినాయక్ రెడ్డికి విచారణ బాధ్యతలు అప్పగించారు. ఆయన తప్పుడు నివేదిక ఇవ్వడంతో విజయభాస్కర్ రెడ్డిని అక్కడే కొనసాగించారు. ఎన్నికల విధులకు సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఏవోలు తదితర విభాగాల్లోని సిబ్బందిని ఈ ముగ్గురు అధికారులు నియమించారు. ఉద్దేశపూర్వకంగా సదరు సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించారు. జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ సమయంలో వీరు వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంది.' అని మన్నవ సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు.

'మాచర్లలో ఈవీఎం పగులగొట్టిన సంఘటన వారం రోజుల పాటు వెలుగులోకి రాకుండా దాచిపెట్టడంలో, పోలింగ్ బూత్ ల్లో దౌర్జన్యంగా ప్రవేశించి పోలింగ్ ఏజెంట్లను వైకాపా నేతలు భయభ్రాంతులకు గురిచేయడంలో, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంలో పూర్తి బాధ్యత విజయభాస్కర్ రెడ్డి, వినాయక్ రెడ్డి, గజ్జల శ్రీనివాసరెడ్డిలదేనని స్పష్టమవుతోంది. కౌంటింగ్ రోజున పెద్దఎత్తున హింసాత్మక ఘటనలకు వైకాపా పాల్పడే అవకాశం ఉన్నందున అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్న ఈ ముగ్గురు అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం.' అని టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ గూడపాటి లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు.



సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు తనకు కేటాయించిన ప్రింటింగ్ మరియు స్టేషనరీ డీజీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పదవీ విరమణ చేయగా.. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరావు ఏబీవీని కలిసి అభినందనలు తెలియజేస్తున్న చిత్రం.

# సజ్జల రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

**- ఎన్నికల చట్టాలను ధిక్కరించేలా కౌంటింగ్ ఏజెంట్లను ప్రేరేపించడం దారుణం**

**- కౌంటింగ్ రోజున టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి: టీడీపీ నేత వర్మ**



పిఠాపురం (చైతన్యరథం) : ఓటమి భయంతో వైసీపీ నాయకులు కౌంటింగ్ వేళ దాడులకు, అల్లర్లకు పాల్పడే అవకాశం ఉందని, వైసీపీ కవ్వింపు చర్యలకు టీడీపీ శ్రేణులు స్పందించాల్సిన అవసరం లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్ వీఎస్ఎన్ వర్మ వ్యాఖ్యానించారు. వైసీపీ నీచ రాజకీయాలు రోజురోజుకు బయటపడుతున్నాయని, దోచుకోవడమే లక్ష్యంగా సాగించిన ఐదేళ్ల పరిపాలనను కోల్పోతున్నామనే భయంతోనే దాడులు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఎన్డీయే కూటమి తరుపున ఏజెంట్లుగా ఉండే వారు సంయమనం పాటించి కౌంటింగ్ ప్రక్రియపై దృష్టిసారించాలని కోరారు. కౌంటింగ్ రోజున వైసీపీ నాయకులు కావాలని గొడవలు సృష్టించే అవకాశం ఉందని, ఈ విషయంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని వర్మ డిమాండ్ చేశారు. వైసీపీ ఏజెంట్ల సమావేశంలోఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి కౌంటింగ్ ప్రక్రియకు భంగం కలిగించేలా సజ్జల మాట్లాడారని మండిపడ్డారు. ఎన్నికల చట్టాలను ధిక్కరించేలా కౌంటింగ్ ఏజెంట్లను ప్రేరేపించడం ద్వారా మోడల్ ప్రవర్తనా నియమావళిని సజ్జల ఉల్లంఘించారని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియకు ముందు సజ్జల రామకృష్ణ రెడ్డి చేసిన తీవ్రమైన నేరంగా పరిగణించాలని కోరారు. సజ్జల వ్యాఖ్యలను చూస్తుంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వోద్యోగులను బెదిరించినట్లేనని అన్నారు. సజ్జల ప్రకటన రెచ్చగొట్టే విధంగా ఉందని అన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని వర్మ కోరారు.

# ఓటమి తట్టుకోలేక సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు

**మండిపడ్డ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్**



కదిరి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం, ప్రజాస్వామ్యవాదులు అసహ్యించుకునే రీతిలో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తున్న వాతావరణం పూర్తిస్థాయిలో నెలకొందని కదిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కదిరిలో మీడియాతో మాట్లాడుతూ... ఓటమిని తట్టుకోలేక సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, వైసీపీ నిబంధనలు పాటించని పార్టీ అని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు మారుపేరు అని అన్నారు. చట్టబద్ధంగా వెళ్దామని, చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన టీడీపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించినా.. సయుంమనం పాటించాలని సూచించారు. ఎన్నికల్లో గెలవబోతున్నామని, ప్రభుత్వంలో భాగస్వాములం కాబోతున్నామని, విజయాన్ని ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం, వినియోగించుకునే విధంగా ఆలోచన చేద్దామని కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.

# చంద్రబాబు సీఎం కావాలంటూ మోకాళ్లపై ఇంద్రకీలాద్రి ఎక్కిన టీడీపీ కార్యకర్త



విజయవాడ (చైతన్యరథం): జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, చంద్రబాబు తిరిగి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ... శుక్రవారం గన్నవరం నియోజకవర్గం అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య మోకాళ్లపై నడుస్తూ విజయవాడ కనకదుర్గమ్మ కొండను ఎక్కి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం సతీసమేతంగా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీ నాయకుల దాడులలో గాయపడిన టీడీపీ నాయకుడు తిరుపాల్‌ని, కుళ్లాయప్ప కుటుంబాలను పరామర్శిస్తున్న ధర్మవరం నియోజకవర్గ టీడీపీ నేత పరిటాల శ్రీరామ్, సత్య కుమార్ యాదవ్

# జే-గ్యాంగ్ కబంధ హస్తాల్లో లక్షలాది ఎకరాల దళితుల అసైన్డ్ భూములు

**- కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపిస్తాం**

**- టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్ స్పష్టీకరణ**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, జే-గ్యాంగ్ భూకబ్జాలన్నీ బయటపడుతున్నాయని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్ ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రతో సహా రాష్ట్రంలో లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు జే-గ్యాంగ్ కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయాయని, రాష్ట్రం మొత్తం మీద దాదాపు 14 లక్షల ఎకరాల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అసైన్డ్ భూములు కబ్జాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. 40, 50 ఏళ్ల నుంచి వారసత్వంగా అనుభవిస్తున్న అసైన్డ్ భూములపై జే-గ్యాంగ్ కన్నుపడటం వల్లే జీవో నెం. 596 తీసుకొచ్చారన్నారు. వైసీపీ భూబకాసురుల కోసమే అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ చట్టానికి సవరణలు చేశారని అన్నారు. పేదలను వైసీపీ నేతలుప్రలోభపెట్టి భూములు కొట్టేయాలనుకోవడం నీచం అని విమర్శించారు. పేదలకు భూములపై హక్కులు కల్పిస్తామని చెప్పి జగన్ రెడ్డి తన పార్టీ భూకబ్జా ముఠాలకు భూములు కట్టబెట్టాడని, ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు కాజేశారని జనసేన నేత మూర్తియాదవ్ చేస్తున్న సవాల్‌ను చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి స్వీకరించకుండా బెదిరింపులకు దిగుతూ లీగల్ నోటీసులు పంపడం దుర్మార్గమని అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన చీఫ్ సెక్రటరీ ప్రజల ఆస్తులను దోచుకోవడం దారుణం. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కూడా ఇంతటి నీచానికి పాల్పడలేదని జవహర్ రెడ్డిని ఉద్దేశించే విమర్శించారు. గత 60 ఏళ్లలో ఇంతటి అవినీతిపరుడైన సీఎస్‌ను ఎన్నడూ చూడలేదని అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో హింస చెలరేగడానికి కూడా సీఎస్ జవహర్ రెడ్డే కారణమని, ప్రభుత్వ పాలనను నడపాల్సిన సీఎస్ జవహర్ రెడ్డి భూకబ్జాల వ్యవహారాల్లో తలమునకలయ్యారని ఎద్దేవా చేశారు. పేదల భూ సమస్యలు పరిష్కరించేందుకు మనసురాని అధికారులు కబ్జాదారులు చెబితే మాత్రం నిముషాల్లో రికార్డులు తారుమారు చేస్తున్నారని విమర్శించారు. డీ-పట్టాలు ఇచ్చి వందలాది ఎకరాలు అమాయకపు పేదల అసైన్డ్ భూములు రాయించుకుంటూ అగ్రిమెంట్లు చేయించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసైన్డ్ భూములపై విచారణ చేయించి జే-గ్యాంగ్ భూకబ్జాలను బయటపెట్టి కోర్టుల్లో నిలబెడుతాం. జగన్ రెడ్డి పాలనలో పరాధీనంలోకి వెళ్లిన లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను గుర్తించి పేదలకే దక్కేలా చర్యలు తీసుకుంటామని అఖిల్ స్పష్టం చేశారు.

చైతన్యరథం

# చంద్రబాబు జీవితం యువతకి స్ఫూర్తిదాయకం

**- టీడీపీ అధినేత జీవితం ఆధారంగా తెరకెక్కిన తెలుగోడు బయోపిక్ - చంద్రబాబును కలిసి చిత్ర విశేషాలను పంచుకున్న చిత్ర యూనిట్**

హైదరాబాద్ (చైతన్యరథం): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జీవితం ఆధారంగా రూపొందిన 'తెలుగోడు... ప్రపంచంపై తెలుగోడి సంతకం' బయోపిక్ యూట్యూబ్‌లో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈసినిమాకు కథ, కథనం, మాటలు, స్వీయ దర్శకత్వం వహించిన డాక్టర్ వెంకీ మేడసాని శుక్రవారం హైదరాబాద్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రం రూపొందించిన తీరు అందులోని పాత్రల సంబంధించిన విశేషాలను చంద్రబాబుతో చిత్ర యూనిట్ సభ్యులు పంచుకున్నారు.

అనంతరం వెంకీ మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు అంటే విజనరీ అని, ముందు తరాలను దృష్టిలో పెట్టుకొని ఆయన పాలన చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన చేపట్టిన సంస్కరణలు, భావి తరాల భవిష్యత్తుకు వేసిన బాటలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి కారణంగా నగరాలకు వచ్చిన పల్లె ప్రజలు ఉన్నతమైన జీవితం సాగిస్తున్నారని, అంతేకాకుండా నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు చేస్తున్నారంటే అందుకు చంద్రబాబే కారణమని వెంకీ కొనియాడారు. 'ప్రపంచ రాజకీయ యవనికపై సుస్పష్టమైన ప్రణాళిక, దార్శనికత కలిగిన అతి




కొద్దిమంది నాయకుల్లో నారా చంద్రబాబునాయుడు ఒకరు. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా ప్రజాసేవే పరమావధిగా ఉన్న నాయకుడు. నాలుగు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో సవాళ్ళ, మరెన్నో సంక్షోభాలను ఎదుర్కొని వాటినే అవకాశాలుగా మలుచుకొని దార్శనికత నేతగా ఎదిగిన చంద్రబాబు వ్యక్తిత్వం, ఆయన ఆదర్శ విధానాలు నేటి యువతకి స్ఫూర్తిదాయకం.' అని దర్శకుడు వెంకీ వ్యాఖ్యానించారు.

## నిజాయితీకి మారుపేరుగా నిలిచిన ఏబీ వెంకటేశ్వరరావు

**- పదవీవిరమణ శుభాంకాక్షలు తెలియజేసిన టీడీపీ నేత ఆళ్ళ**



విజయవాడ (చైతన్యరథం): నీతి, నిజాయితీకి మారు పేరైన ఏబీ వెంకటేశ్వరరావు తన సర్వీసులో ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొని చివరి గా సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం డైరెక్టర్ జనరల్‌గా శుక్రవారం పదవీ విరమణ చేయటం మాకెంతో ఆనందదాయకమని టీడీపీ సీనియర్ నేత ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు వ్యాఖ్యానించారు. న్యాయం కోసం సుదీర్ఘపోరాటం అనంతరం విజయవాడ లోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమీషనర్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టి సాయంత్రానికి డైరక్టర్ జనరల్‌గా పదవీ విరమణ చేసిన అనంతరం ఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ నేతలు కలిసి దుశ్వాలుతో సత్కరించారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ఆనందమయంగా సాగాలని కోరుకుంటు న్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగన్న గూడెం ఎం.పీ.టీ.సీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, గ్రామ ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు, అలపాటి రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లు పోలీసులు ఎవరి కనుసన్నల్లో పని చేశారు?

**- ఎన్నికలు ప్రశాంతంగా జరగడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారా**

**- మేము చెబితే.. పోలీసులు, ఎన్నికల అధికారులు వింటారా**

**- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, అతని అనుచరగణంపై మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజం**

రాప్తాడు (చైతన్యరథం): ఐదేళ్ల పాటు పోలీసులను, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి... ఇప్పుడు పోలీసులు, ఎన్నికల కమిషన్ నిక్కచ్చిగా, నిజాయితీగా పని చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని.. వెంకటాపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మా కనుసన్నల్లో పోలీసులు బైండోవర్లు వేస్తున్నారని చెప్పడం అతను అతని అనుచరుల దిగజారుడుతనానికి నిదర్శనంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించారు కాబట్టే.. రాప్తాడులో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. నియోజకవర్గంలో ఎన్నో సమస్యాత్మక గ్రామాలు ఉన్నప్పటికీ పోలీసులు ముందు జాగ్రత్తలతో చిన్న గొడవ కూడా లేకుండా చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కొంతమందిని బైండోవర్లు చేస్తున్నారన్నారు. ఎన్నికల



తర్వాత కొన్ని ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని.. అధికారులు ఈ చర్యలు తీసుకోవడం సహజమన్నారు. కేవలం వైసీపీ వారిని మాత్రమే బైండోవర్ చేస్తున్నారని చెప్పడం ఎంత మాత్రం సరికాదని.. ఇందులో టీడీపీకి చెందిన వారు కూడా ఉన్నారన్నారు. తోపుదుర్తిలో ఎన్నికల ముందు మీరు చేసిన దౌర్జన్యాలు, దాడులను దృష్టిలో ఉంచుకునే పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని.. అదే మద్దల చెరువు లాంటి సమస్యాత్మక గ్రామంలో కేవలం ఒక్క మహిళా పోలీస్ మాత్రమే ఉన్నారన్నది మర్చిపోవద్దన్నారు.

**ఎవరు ఫ్యాక్షనిస్టులు.. ఎవరు కనిపించకుండా పోయారు**

2019 ఎన్నికల తర్వాత నువ్వు ఎమ్మెల్యేగా గెలిచి ఏమేరకు ప్రజలకు అందుబాటులో ఉన్నావో ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకోవాలని.. మాజీ మంత్రి పరిటాల సునీత, ప్రకాష్ రెడ్డికి చురకలంటించారు. నాటి నుంచి నేటి వరకు నేను నియోజకవర్గ ప్రజలతోనే ఉన్నానన్నారు. నా సోషియల్ మీడియా అకౌంట్స్ లో వెనక్కు వెళ్లి చూస్తే.. నేను ప్రజలకు అందుబాటులో ఉన్నానో లేదో తెలుస్తుందన్నారు. కరోనా సమయంలో నువ్వు, నీ సోదరులు ఎక్కడ దాక్కున్నారని నిలదీశారు. నువ్వు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజల్ని కాదు కదా.. కనీసం నిన్ను గెలిపించిన నాయకులు కూడా కలిసే పరిస్థితి లేకుండా చేశావని.. అందుకే నీ ఓటమిని వారు డిసైడ్ చేశారన్నారు.

నేను ప్రజలకు అందుబాటులో ఉన్నాను కాబట్టే.. నాకు ఓటు వేశారన్నారు. ఈ ఐదేళ్లలో నువ్వు ఎంత మందిపై దాడులు చేయించావ్.. మీ సోదరులు రివాల్వర్ తీసుకుని కిడ్నాప్ లు చేసిన సంఘటనలు ప్రజలు మర్చిపోలేదన్నారు. మీరు ఎంత రెచ్చగొట్టినా.. ఎన్ని దాడులు చేసినా మేము చట్టబద్ధంగా వెళ్తున్నాం కాబట్టే గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయన్నారు. మేము కూడా మీలానే దాడులు చేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ కార్యకర్తలు, నాయకులపై ఎంత మంది మీద అక్రమ కేసులు పెట్టించావో గుర్తు తెచ్చుకోవాలని సునీత హితవు పలికారు. ఓటమి భయంతో ప్రకాష్ రెడ్డి ఆయన అనుచరులతో ఏవేవో మాట్లాడిస్తున్నారని.. జూన్ 4 తర్వాత మీ ఆటలు సాగవని హెచ్చరించారు. ఎన్నికలు ఎంత ప్రశాంతంగా జరిగాయో.. కౌంటింగ్ కూడా అంతే ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని సునీత విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రామగిరి మండల తెదేపా కన్వీనర్ కురుబ సుధాకర్, మాదాపురం శంకర్ పాల్గొన్నారు.

## కౌంటింగ్ వేళ టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి

**- వైసీపీ కవ్వింపు చర్యలకు కౌంటింగ్ ఏజెంట్లు స్పందించొద్దు**

**- టీడీపీ శ్రేణులకు సూచించిన మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి**



మాచర్ల (చైతన్యరథం): కౌంటింగ్ రోజున టీడీపీ శ్రేణులు సంయమనం పాటించి, కౌంటింగ్ ప్రక్రియపైనే పూర్తిగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. టీడీపీ తరుపున కౌంటింగ్ ఏజెంట్లుగా ఉన్న వారి పట్ల వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందని, టీడీపీ ఏజెంట్లు వాటికి స్పందించొద్దని, అవసరమైతే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఓట్ల లెక్కింపు రోజు, అనంతరం గ్రామాల్లోని టీడీపీ కార్యకర్తలు పూర్తిగా సంయమనం పాటించాలని కోరారు. ఓటమి భయంతో కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడేలా సజ్జల రామకృష్ణారెడ్డి వారి కార్యకర్తలకు ట్రైనింగ్ ఇవ్వడం దుర్మార్గమని, కౌంటింగ్ జరిగే ప్రదేశంలో అవసరమైతే ఎటువంటి నిబంధనలు పాటించవొద్దు అంటూ సజ్జల చేసిన వ్యాఖ్యాలను ఈసీ సుమోటోగా తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలని జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. మరో మూడు రోజుల ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందని, ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. వ్యవస్థలన్నింటికి ప్రజలు, టీడీపీ కార్యకర్తలు పూర్తిగా సహకరించాలని జూలకంటి విజ్ఞప్తి చేశారు.

## సీఎస్ జవహర్‌రెడ్డి తన నిబద్ధతను నిరూపించుకోవాలి

**- విశాఖ అసైన్డ్ భూ కుంభకోణంపై సీబీఐ విచారణ చేపట్టాలి**

**- డిమాండ్ చేసిన గల్ఫ్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు రావి రాధాకృష్ణ**

అమరావతి (చైతన్యరథం): 'దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా జగన్‌రెడ్డి గ్యాంగ్ పేదల భూములను దోచుకొని, పంచుకుంటున్నారు. విశాఖలో దళితుల అసైన్డ్ భూములను సీఎస్ జవహార్ రెడ్డి ఆయన కుమారుడు మింగాలని ప్రయత్నించడం మహాఘోరం. పేదవాడి భూమిని కొట్టేయడమే సీఎస్ జవహార్‌రెడ్డి చట్టమా? సుమారు రూ.4 వేల కోట్లు విలువగల 800 ఎకరాల అసైన్డ్ భూమిని తన కుమారిడికి అప్పనంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహార్‌రెడ్డి జీవో నెం.596 విడుదల చేయడం ఘోరాతిఘోరం. రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులకు ఆదర్శంగా నిలబడాల్సిన సీఎసే బరితెగించి భూభకాసురుని వేషం వేస్తే రాష్ట్రంలో న్యాయం చేసేదెవరు? అన్యాయం జరుగుతుందయ్యా... మాకు న్యాయం చెయ్యండి అని ఎవరినైతే వేడుకుంటామో అతనే అన్యాయాలు చేస్తుంటే ఇంకెవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. భూకుంభకోణంపై సీఎస్ జవహార్ రెడ్డి అతని కుమారుడిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలి' అని గల్ఫ్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు రావి రాధకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎస్ స్థాయిలో ఉన్న వ్యక్తి తన నిబద్ధతను నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



శాఖాపరంగా కూడా దర్యాప్తు చేయాలని, భోగాపురం ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో వున్న అసైన్డ్ భూములను కొట్టేయాలనే ఆలోచన దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బ్యూరోక్రసీలు కూడా దోపిడీలకు పాల్పడం ఘోరమని, ఈ వ్యవహారంలో జిల్లా స్థాయిలో ఉన్న అధికారుల కూడా భాగస్వామ్యం ఉందన్నారు. 'జీవో 596 ద్వారా డీఫామ్ పట్టాలను కొట్టేస్తున్న తీరు స్పష్టంగా ఉంటే సీఎస్ ఎందుకు విచారణ కోరట్లేదు? పెద్ద కుంభకోణం కాబట్టి సీఎస్ జవహర్‌రెడ్డిని బాధ్యతల నుంచి తప్పించి విచారణ చేపట్టాలి. ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగం తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ)కి అనేక సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఉత్తరాంధ్రలో పెద్ద ఎత్తున జరిగిన భూ దోపిడీలో సీఎస్ ప్రమేయంపై ఆధారాలున్నా.. జవహర్‌రెడ్డి రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారు. డీ ఫామ్ పట్టాల న్నింటినీ సీజ్ చేసి కలెక్టర్ సహా, సంబంధిత అధికారులందరిపైనా విచారణ జరగాలి. ఆధారాలతో ఆరోపణలు చేస్తే.. విచారణ కోరకుండా, ఆరోపణలు చేసిన వారిని సీఎస్ బెదిరిస్తున్నారు. జవహార్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మా ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.' అని రావి రాధాకృష్ణ తన లేఖలో ప్రశ్నించారు.

# జూన్ 4 తర్వాత రాష్ట్రానికి స్వర్ణయుగం

## చంద్రబాబు సీఎం కావాలంటూ గళ్లా మాధవి ప్రత్యేక ప్రార్థనలు





**గుంటూరు (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4 తరవాత స్వర్ణయుగం ప్రారంభం కానుందని, నారా చంద్రబాబు నాయుడు అను నేను ఒక్క పిలుపుతో ప్రజాపాలన మొదలు కానున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గళ్ల మాధవి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం జీటీ రోడ్డులోని హాజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గాలో గళ్ల మాధవి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. బాబాకు ప్రత్యేక చద్దర్ సమర్పించి కూటమి అధికారంలోకి వచ్చి ప్రజా రాజధాని అమరావతి త్వరగా పూర్తి అవ్వాలని, ప్రజా జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ప్రార్థించారు.

అనంతరం గుంటూరు బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి గుడిలో జరుగుతున్న విష్ణు సహస్ర నామాలు,లలిత సహస్రనామ పారాయణంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీమతి శ్రీరత్నతో కలిసి గళ్ళ మాధవి పాల్గొని పూజలు నిర్వహించారు. చంద్రబాబు చొరవతో రాజధాని అమరావతిలో టీటీడీ వెంకటేశ్వరస్వామి గుడిని నిర్మిస్తే, జగన్మోహన్‌రెడ్డి తిరుమల ప్రతిష్ఠతను మసకబారే విధంగా ప్రవర్తించరాని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల ఫలితాలు వైసీపీకి దిమ్మ తిరిగే విధముగా ఉండబోతున్నాయని గళ్ళా మాధవి జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, తెలుగుమహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**తెలుగు సినిమా స్థాయిని పెంచిన సూపర్ స్టార్ కృష్ణ : గళ్ల మాధవి**

సినీహీరో స్వర్గీయ ఘట్టమనేని కృష్ణ జయంతిని పురస్కరించుకొని గుంటూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద వారి చిత్రపటానికి పూలమాలలు వేసి గళ్ల మాధవి నివాళ్లర్పించారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ... సూపర్ స్టార్ కృష్ణ. ఈ పేరు తెలుగు సినిమా ఉన్నంత కాలం గుర్తుండిపోయే పేరు అని, సూపర్ స్టార్ అనే పదానికి నిలువెత్తు నిదర్శనం ఆయన అని కొనియాడారు. ఎందరో మహానుభావులతో పాటు తెలుగు సినిమా స్థాయిని పెంచారని, తెలుగు సినిమాను కొత్త పుంతలు తొక్కించిన కృష్ణ.. గురించి ఎంత చెప్పిన తక్కువేనన్నారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాత తన ప్రతిభను చాటుకున్నారని, దాదాపు 350కు పైగా సినిమాల్లో నటించి మెప్పించిన సూపర్ స్టార్ కృష్ణ తెలుగు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారని పేర్కొన్నారు.

## నరసరావుపేట పట్టణంలో పోలీస్ కవాతు



**నరసరావుపేట (చైతన్యరథం):** పల్నాడు జిల్లా ఐ.జి ఆదేశాల మేరకు ఎస్పీ మల్లికా గార్గే ఆధ్వర్యంలో స్థానిక కోట సెంటర్ నుండి పల్నాడు బస్టాండ్ వరకు పోలీస్ కవాతు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ మల్లికా గార్గ్ మాట్లాడుతూ... స్టేట్ పోలీసులు, పారా మిలిటరీ సెంట్రల్ పోలీసులు పల్నాడు జిల్లాలో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని, కౌంటింగ్ జరిగే వరకు ఎవరు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఉండాలని కోరారు. ఎవరైనా లా అండ్ ఆర్డర్ విఘాతం కలిగిస్తే వారిపై కఠినచర్యలు తప్పవని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, కౌంటింగ్ రోజు ఎటువంటి సంబరాలు గాని, బాణసంచా పేల్చడం వంటి చర్యలకు అనుమతులు లేవని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే... వారిని కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ మల్లికా గార్గ్ స్పష్టం చేశారు.

పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీకి ఎందుకింత భయం?

## ఎలక్షన్ కమిషన్‌పై నిసిగ్గుగా విషం కక్కుతున్న వైసీపీ

### - మండిపడ్డ టీడీపీ నేత యశ్వంత్ రెడ్డి



**తిరుపతి (చైతన్యరథం):** పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీకి ఎందుకింత భయపడుతున్నారో అర్థం కావడం లేదని తిరుపతి పార్లమెంట్ టీడీపీ సెక్రటరీ యశ్వంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ బ్యాలెట్ వివరణపై వైసీపీ మోసపూరిత ప్రకటనలు చేస్తోందన్నారు. ఏపీ హైకోర్టులో పోస్టల్ బ్యాలెట్‌పై వేసిన అప్పీల్‌లో వైసీపీ తోక ముడిచిందన్నారు. తాము ఓడిపోయినా.. నిసిగ్గుగా ఎలక్షన్ కమిషన్ పై వైసీపీ విషం కక్కుతోందని, కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన వివరణను యధాతథంగా ప్రకటించిన... రాష్ట్ర ఎన్నికల అధికారి చర్యలపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. హైకోర్టులో వారి వాదనలను వైసీపీ వెనక్కి తీసుకుందని యశ్వంత్ రెడ్డి తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో వైసీపీ అర్థం లేని ఆరోపణలు చేస్తోందని, పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు స్టాంప్ ఉండాలన్న నిబంధన లేదన్నారు. ఈసీ ఏవో సడలింపులు ఇచ్చిందని దీనివల్ల అక్రమాలు జరుగుతాయనే వైసీపీ వాదన అసంబద్ధమని, సీఈఓ ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీకి ఫేవర్ చేసినట్లు వైసీపీ నేతలు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ నేతలు ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని, ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తుందన్నారు. వైసీపీ ఎన్ని కుతంత్రాలు చేసిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలవడం ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని యశ్వంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఆర్వో శ్రీలేఖ సస్పెన్షన్ ముమ్మాటికి వైసీపీ కక్షసాధింపు చర్యే

### - మండిపడ్డ గుంటూరు జల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్



**గుంటూరు (చైతన్యరథం):** యర్రగొండపాలెం నియోజకవర్గం ఆర్వో శ్రీలేఖ సస్పెన్షన్ ముమ్మాటికి వైసీపీ నాయకుల కక్షసాధింపు చర్యేనని గుంటూరు జిల్లి బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. నిజాయితీగా పనిచేసే అధికారులను సస్పెన్షన్ కు గురిచేయడం వైసీపీ పాలనలో షరా మామూలైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ... కౌంటింగ్ కి ముందు యర్రగొండపాలెం ఆర్వోని ఎన్నికల కమిషన్ బాధ్యతల నుంచి తొలగించడంలో అంతర్యమేమిటీ? అని ప్రశ్నించారు. ఎన్నికల వేళ అధికారపార్టీ ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా పనిచేసి నందుకు ఆర్వో శ్రీలేఖను విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. ఆర్వో శ్రీలేఖ నిజాయితీ వల్లనే వీరభద్రాపురం, శతకోడు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెదిరింపులకు, దౌర్జన్యాలకు తలొగ్గకుండా ఎదిరించి విధులు నిర్వర్తించారని ఆ కారణంగానే ఆర్వో శ్రీలేఖను సస్పెన్షన్ కు గురిచేశారని, అధికార పార్టీ ఒత్తిళ్ల కారణంగానే ఆర్వోను తొలగించారని శ్రీనివాస్ ఆరోపించారు. ఎన్నికల వేళ వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారులను బెదిరించారని, ఆయనపై ఎన్నికల సంఘం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మరోవైపు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఆర్వో రాజ్యలక్ష్మి, పొన్నూరు నియోజకవర్గ ఆర్వో లక్ష్మీ కుమారీల పనితీరు దారుణంగా ఉందని, ఏకపక్షంగా వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని వేములకొండ శ్రీనివాస్ మండిపడ్డారు. నిబంధనలు తుంగలోతొక్కి అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారని అన్నారు. వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్వో రాజ్యలక్ష్మి పోలింగ్ రోజున గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి విడదల రజిని గెలుపు కోసం ఐవీఆర్ ఎస్ కాల్స్ ద్వారా ప్రజల్ని ప్రభావితం చేశారని, ఆమే చర్యలు తీసుకోవాలన్నారు. పొన్నూరు నియోజకవర్గ ఆర్వో అసమర్ధ చర్యలతో పి.వో. డైరీలు అదృశ్యం, 17సి ఫారాలు గల్లంతు వంటి ఘటనలు జరిగినా ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏకపక్షంగా వ్యవహరించిన ఆర్వోలపై తగుచర్యలు తీసుకోవాలని వేములకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## యర్నేని సీతాదేవికి నివాళులర్పించిన నెట్టెం రఘురామ్



**కైకలూరు (చైతన్యరథం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, పూర్వపు ముదినేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నానని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని వేడుకుంటు న్నానని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలం కోడూరు గ్రామంలోని యెర్నేని సీతాదేవి స్వగృహానికి వెళ్లిన రఘురామ్... సీతాదేవి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీతాదేవి కుటుంబంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, మంత్రి మండలిలో విద్యాశాఖ మంత్రిగా ఎంతో సమర్థ వంతంగా ఆమె పని చేశారని కొనియాడారు. విజయ డైరీ డైరెక్టర్‌గా రైతులకు మెరుగైన ఆదాయం వచ్చే విధంగా సీతాదేవి అండగా నిలిచారని, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి సీతాదేవి అని నెట్టెం రఘురామ్ వ్యాఖ్యానించారు.

## ఓటమి భయంతోనే పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీ వివాదం

### - మండిపడ్డ మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



**చిలకలూరిపేట (చైతన్యరథం):** ఎన్నికల్లో ఓటమి భయంతోనే అధికార వైసీపీ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌పై వివాదాల రేపేందుకు తంటాలు పడుతోందని మాజీమంత్రి, తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. అయిదేళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను రాచిరంపాన పెట్టి, కర్కశంగా అణిచి వేసింది చాలక ఇప్పుడు వారి ఓట్ల విషయంలోనూ చిక్కులు పెడుతుండడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. పోస్టల్ బ్యాలెట్ల జారీ, పోలింగ్ సమయంలోనే సాధ్యమైనంత మందికి ఆ అవకాశం లేకుండా అడ్డుకోవాలని, తమవైపు తిప్పుకోవాలని విఫలయత్నాలు చేసిన వైసీపీ ఇప్పుడు ఆ ఓట్లను చెల్లుబాటు కాకుండా చేసేందుకు మోకాలడ్డుతుండడం దారుణమన్నారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వైసీపీ తీరుని తీవ్రంగా దుయ్యబట్టారు. దీనంతటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 4లక్షల 44వేల 216 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలింగ్ కావడమే కారణమన్నారాయన. పోలైన మొత్తం పోస్టల్ ఓట్లలో కనీసం 90 శాతం తెలుగుదేశం కూటమికే పడ్డాయన్న అంచనాలతో సీఎం జగన్ రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు. కీలకమైన స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఓటమును నిర్ణయించే స్థాయిలో ఈ ఓట్ల సంఖ్య ఉండడంతోనే లేనిపోని చిక్కులు పెట్టి ఓటమి నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన డిక్లరేషన్‌పై గెజిటెడ్ ఆఫీసర్ స్టాంప్ లేకున్నా, బ్యాలెట్ కవర్‌పై ఓటరు సంతకం లేకపోయినా బ్యాలెట్ పేపర్‌ను తిరస్కరించకూడదని ఎన్నికల సంఘం నిబంధనలు చెబుతున్నా వైసీపీ ఫిర్యాదుల వెనక మర్మం అంతకంటే మరోటి లేదని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. అధికార వైసీపీ ఎంత తలకిందులుగా తపస్సు చేసినా వారి దింపుడుకళ్లెం ఆశలు ఫలించవని, వైసీపీ ఓటమి పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో వైసీపీ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు శాశ్వతంగా దూరమైపోయిందనే విషయం కూడా స్పష్టం అవుతోందని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు.

# సంపద సృష్టికి.. సీక్రెట్ ఫార్ములా



**ఆర్థికంగా స్థిరపడ్డ, సక్సెస్ అయిన గొప్పవారంతా చెప్పేది ఒక్కటే... ధనవంతుడికి ఐశ్వర్యవంతుడికి మధ్య తేడా తెలుసుకోమని, ధనవంతుడు సంపాదిస్తాడు, అదే విధంగా ఖర్చు చేస్తాడు. అదే ఐశ్వర్యవంతుడు మాత్రం సంపాదించిన దాన్ని దాస్తాడు. దాన్ని మరింత వృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు రచిస్తాడు. డబ్బే డబ్బుతో పనిచేయించాలనే సంపద సీక్రెట్ ఫార్ములాను అనుసరిస్తాడు. ఇదే వారిద్దరి మధ్య ఉన్న ప్రధాన తేడా. అయితే ధనవంతుడు కేవలం డబ్బు సంపాదిస్తే చాలు అన్నీ వచ్చేస్తాయనుకుంటాడు. కానీ అదొక్కటే సరిపోదని వారెన్ బఫెట్, రాబర్ట్ కియోసాకీ వంటివారు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని చెప్పారు. సీకే ప్రహ్లాద్ "ది ఫార్చ్యూన్ ఎట్ ది బాటమ్ ఆఫ్ పిరమిడ్" సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. దీని ఆధారంగా వెల్త్ పిరమిడ్ అనే అంశాన్ని నాలుగు భాగాలుగా విభజించి జీవితంలో ఉన్నతమైన వ్యక్తిగా ఎలా ఎదగాలో ఇక్కడ తెలుసుకుందాం..**

సంపదను సృష్టించుకోవడమంటే అత్యధిక రాబడులను వేగంగా సంపాదించడం మాత్రమే కాదు. సంపద సృష్టికి స్థిరమైన రాబడులను పొందడం కూడా ముఖ్యం. ఇది ఒక రాత్రిలో జరిగే విషయం కాదు. సహనం, సరియైన ప్రణాళిక చాలా అవసరం. నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పెట్టుబడులను దీర్ఘకాలం కొనసాగించాలి.

## ముందు చిన్నగా మొదలు పెట్టాలి



అలా ఒక్కసారి వేర్వేరు మార్గాల ద్వారా నగదు సంపాదించడం మొదలైతే క్రమంగా అదే పెరుగుతుంది. ఇలా సంపాదించాలంటే ఇలాంటి అనేక మార్గాలున్నాయి.

1. సోషల్ మీడియా జనరేషన్ నడుస్తుంది కాబట్టి దీని ద్వారా ఫాలోవర్స్‌ను పెంచుకోవచ్చు. నచ్చిన అంశాలను ఎంచుకుని కంటెంట్ సరిగ్గా రీచ్ అయ్యేలా చూసుకోండి. దీంతో వివిధ బ్రాండ్‌లకు సంబంధించిన ప్రొడక్ట్స్‌ను ప్రమోట్ చేయొచ్చు.
2. ఇన్వెస్ట్‌మెంట్ కోసం పెద్దగా ఆర్జించాల్సిన పనిలేదు. నెలజీతంలో పెట్టుబడికి 5శాతం కేటాయించుకున్నా మంచి పునాదిని వేసుకున్నట్టే. అదే క్రమంగా పెరుగుతుంది.
3. రియల్ ఎస్టేట్ ద్వారా కూడా మంచి ఆదాయాన్ని జనరేట్ చేయొచ్చు. కాస్త పెట్టుబడి పెట్టగలిగినా, మీ ఇంట్లోనే ఉపయోగించని గదులు ఉన్నా సరిపోతుంది. చిన్న స్థలం కొనుగోలు చేసి అందులో రూమ్స్ నిర్మించి అద్దెకు ఇచ్చినా ప్రతీ నెలా ఆదాయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది.
4. స్టాక్ మార్కెట్, బ్యాంక్‌లోని ఇతర పథకాల్లో పెట్టుబడి పెట్టినా అది నెలనెలా కొంత మొత్తాన్ని జనరేట్ చేస్తుంది. మొత్తానికే చేయకపోవడం కంటే చిన్నగా అయినా ప్రారంభిస్తే మీకు ఇది అలవాటు అవుతుంది.

## పునాది దృఢంగా నిర్మించాం, తర్వాత ఏంటంటారా?



ఇలా వివిధ మార్గాల్లో వచ్చిన లాభాలను నగదు రూపంలోకి మార్చడం అంటే మీరు కొన్న ఆస్తులు, భూముల ధర పెరిగి ఉండొచ్చు, లేదా మీ పెట్టుబడులు మంచి లాభాల్లో ఉండొచ్చు. వాటిని నగదు రూపంలోకి మార్చడమనేది వెల్త్ పిరమిడ్‌లో రెండో భాగం. దీన్నే ఆర్థిక స్వతంత్రత అని కూడా అంటారు. ఇలా పెట్టుబడుల మీద పొందిన లాభాన్ని ఏడాదికోసారి లేదా 6 నెలలకోసారైనా విత్‌డ్రా చేసి వేరే దాంట్లోకి మళ్లించాలి. గుడ్లన్నీ ఒకే ట్రేలో పెట్టొద్దని పెద్దలు చెబుతుంటారు. ట్రే కింద పడితే అన్నీ పగిలిపోతాయని దీని అర్థం. అలాగే పెట్టుబడులను కూడా ఒకే చోట కాకుండా వేర్వేరు చోట్ల పెట్టాలి. అప్పుడే నష్టాలను నివారించవచ్చు. ఇది దీర్ఘకాలిక పెట్టుబడిలో కాదు నెలావారీ ఆదాయం పొందేవాటిలో మాత్రమే.

## మూడో భాగం నగదు నిర్వహణ

నెల జీతం ఈ నెల ఖర్చులకు సరిపోతే చాలు.. అని చాలా మంది భావిస్తుంటారు. ముందుగా ఈ ఆలోచన ధోరణి నుంచి బయటకు రావాలి. ఇది ఎదగనివ్వకుండా అక్కడే ఆపేస్తుంది. చాలా మంది అలాగే కంపెనీలు ఆర్థిక నిర్వహణ



తెలియకనే సక్సెస్ అయ్యాక కూడా మళ్లీ మొదటికి వచ్చేస్తాయి. ప్రతి వ్యక్తి జీవితంలో నగదు నిర్వహణ చాలా ముఖ్యం. దీని కోసం అవసరమైతే చార్టెడ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలి. దీన్ని ముందుగా నెలవారీ ఖర్చులు తగ్గించి వాటిని లాభదాయకంగా మార్చడంతో ప్రారంభించాలి.

## నాలుగో భాగం కాపాడుకోవడం



సంపాదించడం పెద్ద కష్టమేమీ కాదు.. రోజువారీ కూలీలు కూడా సంపాదిస్తారు. సంపాదించిన దాన్ని నిలబెట్టుకోవడమే చాలా కష్టమైన విషయం. ఇంట్లో డబ్బును పొదుపు చేసేవారు లేకపోతే అంతే.. కుటుంబం అంతా కలిసి సంపాదించినా మరుసటి నెలలో కనిపించదు. పైగా అప్పు చేయాల్సి వస్తుంది. ధనవంతుడిగా కనిపించడానికి, ధనవంతుడిగా ఉండటానికి మధ్య తేడా ఇదే. కష్టపడి సంపాదించిన సంపదను కాపాడుకోవడమే చెబుతుంది. అనవసర ప్రలోభాలకు లోనవ్వకుండా సంపద సృష్టించేందుకు వేసుకున్న దృఢమైన పునాదిని చెక్కు చెదరనివ్వకుండా కాపాడుకోవాలి.

## వివిధ ఆదాయ మార్గాలు

పిరమిడ్‌తోనే ఎందుకు పోల్చారంటే అది అంత దృఢంగా ఉండటానికి దాని కింది భాగం బలంగా ఉండటమే కారణం. అలాగే ఆదాయ మార్గాలను సృష్టించుకోవడం అనేది పిరమిడ్ కింది భాగంగా చెప్పొచ్చు. ఒకే మార్గంలో వచ్చే ఆదాయంపై ఆధారపడి ముందుకెళ్లలేక దివాళా తీసిన ఎన్నో కంపెనీలను చూశాం.

వివిధ ఆదాయ మార్గాలను సృష్టించుకోవడాన్ని ఇందులో ఆర్థిక భద్రతగా చెప్పుకోవచ్చు. ఇది నెల జీతం మీద ఆధార పడేవారైనా, వ్యాపారం చేసేవారైనా అనుసరిం చాల్సిన విధానం. ఒకే సోర్స్ ద్వారా వచ్చే ఆదాయమైనా సరే దాని ద్వారా వివిధ మార్గాల్లో నుంచి ఆదాయాన్ని పొందవచ్చు. ఇందులో డబ్బే డబ్బుతో పనిచేయిస్తుంది. దీనికోసం అనేక మార్గాలుంటాయి. అవి అందరికీ ఒకేలా పనిచేయకపోవచ్చు కానీ ఆచరించి వాటికి తగ్గట్టు లైఫ్ స్టైల్‌ను మార్చుకుంటే సరిపోతుంది. ఇందులో మొదటిది, ప్రధానమైనది పెట్టుబడే అని చెప్పొచ్చు. ఇందులోనూ అనేక మార్గాలుంటాయి. ఇన్వెస్ట్‌మెంట్స్, రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ పోర్ట్‌ఫోలియో బ్రాండ్ ప్రమోటర్.. ఇలా వివిధ మార్గాల్లో సంపాదించవచ్చు.



చైతన్యరథం

# నేడే ఆఖరి విడత పోలింగ్



- చండీగఢ్, ఏడు రాష్ట్రాల్లోని 57 సీట్లకు పోలింగ్
- ఇప్పటివరకు ఆరు విడతల్లో 486 స్థానాలకు ఓటింగ్
- 4న ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ మొత్తం పూర్తి

**న్యూఢిల్లీ :** నేడే ఏడో ఆఖరి దశకు సంబంధించి పోలింగ్ జరగనుంది. కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ సహా ఈ విడతలో ఏడు రాష్ట్రాల్లోని 57 స్థానాలకు ఓటింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ఆరు దశల్లో 486 సీట్లకు పోలింగ్ జరిగింది. కాగా, లోక్‌సభ, ఏపీ, ఒడిసా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు, వివిధ రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికకు మార్చి 16న షెడ్యూల్ విడుదలైంది. వివిధ దశల్లో నోటిఫికేషన్ల జారీ అనంతరం ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20, 25న పోలింగ్ నిర్వహించారు. అరుణాచల్‌లో జూన్ 2న, మిగతా దేశమంతటా 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దీంతో ఎన్నికల ప్రక్రియ అసాంతం పూర్తికానుంది. మరోవైపు స్వాతంత్ర్యం అనంతరం 1951-52లో జరిగిన తొలి ఎన్నికలు నాలుగు నెలల పాటు సాగాయి. ఆ తర్వాత అత్యధికంగా ఈసారి 44 రోజుల పాటు నిర్వహించారు. షెడ్యూల్ నుంచి ఫలితాల వరకు చూసినా మొత్తం 81 రోజుల పాటు ప్రక్రియ జరిగింది. ఇక నేడు పంజాబ్ (13), హిమాచల్‌ప్రదేశ్ (4), యూపీ (13), పశ్చిమబెంగాల్ (9), బీహార్ (8), ఒడిసా (6), జార్ఖండ్ (3)తో పాటు చండీగఢ్‌లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారాణాసీ నియోజకవర్గం కూడా ఈ దశలోనే ఉంది. కాగా, బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా బహిరంగ సభలు, రోడ్‌షోలు, ర్యాలీలు అన్నీ కలిపి ప్రధాని మోదీ 206 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

2014, 2019ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ప్రధాని మోదీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మూడోసారి ఆయన హ్యాట్రిక్ కొడతారంటూ బీజేపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరో నియోజకవర్గం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి అందరిలో ఉత్కంఠ రేపుతోంది. ఎందుకంటే ఆ నియోజకర్గం నుంచి ఫైర్ బ్రాండ్, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బీజేపీ అభ్యర్థిగా నిలిచారు. ఎన్నికల ప్రచారం మొదలైన నాటి నుంచి ఆమె పలు వివాదాలతో హాట్ టాపిక్‌గా నిలిచారు. మండి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది.
ఇక్కడ ఆ పార్టీ నుంచి రాజకుటుంబానికి చెందిన విక్రమాదిత్యసింగ్ పోటీలో ఉన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పుర్‌లో బీజేపీ నుంచి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ అభ్యర్థిగా సత్‌పాల్ సింగ్ రాయ్‌జాదా తలపడుతున్నారు. అనురాగ్ ఠాకూర్ ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు ఎంపీగా గెలిచారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో సినీనటుల మధ్య పోటీ కావడంతో నియోజకవర్గ ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. బీజేపీ తరఫున భోజ్‌పురీ నటుడు రవికిషన్ పోటీ చేస్తుండగా.. సమాజ్‌వాదీ పార్టీ నుంచి నటి కాజల్ నిషాద్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## ధ్యానంలో ప్రధాని మోదీ



- 45 గంటలు ధ్యానం చేయనున్న ప్రధాని
- ధ్యానానికి ముందు భగవతీ అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

**చెన్నై :** తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్యానం కొనసాగుతోంది. స్వామి వివేకానంద ధ్యానం చేసిన వివేకానంద రాక్ మెమోరియల్‌లో మోదీ మెడిటేషన్ కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం ధ్యాన ముద్రలోకి వెళ్లిన ఆయన.. శనివారం మధ్యాహ్నం వరకు అంటే దాదాపు 45 గంటల పాటు ఇక్కడే రేయింబవళ్లు ధ్యానం చేయనున్నారు. అంతకుముందు తాను పోటీ చేస్తున్న వారణాసి లోక్ సభ స్థానంలో ప్రచారం ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ ఆయన ముందుగా భగవతీ అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రదక్షిణ చేసి కొబ్బరి కాయ, అరటిపండ్లు సమర్పించారు. ఆలయ పూజారులు ప్రధానికి అమ్మ వారి చిత్రపటం అందజేశారు. అనంతరం ఓ పడవలో బయలుదేరి సముద్రం మధ్యలో ఉన్న శిలాస్మారకాన్ని చేరుకొని రామకృష్ణ పరమహంస, మాతా శారదాదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

వివేకానందుడి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించాక ధ్యాన ముద్ర ప్రక్రియను ప్రారం భించారు. ఆయన కేవలం ద్రవాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన కాషాయ దుస్తులు ధరించి ధ్యానంలో కూర్చున్నారు. ఇక ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కన్యాకుమారిలో అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, 2019 ఎన్నికలు ముగిశాక కేదార్‌నాథ్ గుహల్లో ధ్యానం చేసిన ప్రధాని.. ఈసారి తమిళనాడు కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌ను ఎంచుకున్నారు.

## 'నీటి సంక్షోభం'పై కేంద్ర మంత్రికి అతిషి లేఖ..



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని 'నీటి సంక్షోభం'తో అల్లాడుతోంది. తక్షణం ఆదుకోవాలంటూ కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్‌ను ఢిల్లీ నీటిపారుదల శాఖ మంత్రి అతిషి కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రికి శుక్రవారంనాడు ఆమె లేఖ రాశారు."రోజువారీ నీటి అవసరాల కోసం యమునా నదీ జలాలపై ఢిల్లీ ఎక్కువగా ఆధారపడుతుందనే విషయం మీకు తెలుసు. అయితే అవసరమైన నదీ జలాలను హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి వదలకపోవడం వల్ల గత కొద్దిరోజులుగా వజీరాబాద్ బ్యారేజీ వద్ద నీటి మట్టం దారుణంగా పడిపోయింది. ఫలితంగా దేశరాజధానిలో నీటి కొరత తీవ్రమైంది. అదీగాక, ఢిల్లీలో ఉష్ణోగ్రత దాదాపు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవడంతో నీటి అవసరం మరింత తీవ్రమైంది. ఇప్పటికే ఢిల్లీలో పోర్టబుల్ డ్రింకింగ్ వాటర్ డిమాండ్-సప్లయ్ ఇబ్బందులో పడగా తాజా పరిస్థితి మరిత అదనపు భారంగా మారింది" అని అతిష్ ఆ లేఖలో వాపోయారు.
హర్యానా ప్రభుత్వం తగినంత జలాలను విడుదల చేయకుంటే ఢిల్లీలోని ప్లాంట్లులు కూడా గరిష్ఠ స్థాయిలో పనిచేయడం సాధ్యం కాదని అతిషి వివరించారు. సమస్యను వివరిస్తూ హర్యానా ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనికి ఇప్పటికే లేఖ రాశానని, అయితే సీఎం కార్యాలయం నుంచి ఇంకా ఎలాంటి సమాధానం రాలేదని ఆమె కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. నీటిని వృథా చేస్తున్న వారిపై చర్యల కోసం ఇప్పటికే ఆన్-గ్రౌండ్స్ టీమ్‌లను రంగంలోకి దింపినట్టు చెప్పారు.

హర్యానా, యూపీ, మరే ఇతర రాష్ట్రం నుంచైనా జలాలను రాష్ట్రానికి రప్పిస్తే ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఢిల్లీకి న్యాయబద్ధంగా రావాల్సిన జలాలను హర్యానా ప్రభుత్వం తక్షణం విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని, 674.5 అడుగుల సాధారణ స్థాయికి యమునా జలాలు చేరుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని షెకావత్‌ను అతిషి కోరారు.

## భారత్‌కు తరలిస్తున్న లక్ష కిలోల బంగారం

**ముంబయి:** ఇంగ్లాండ్ నుంచి భారత్‌కు లక్ష కిలోల బంగారాన్ని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తరలించింది. గతంలో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో బ్యాంక్ అఫ్ ఇంగ్లండ్‌లో భారత్ భారీగా పసిడి తనఖా పెట్టింది. 1991తర్వాత ఈ స్థాయిలో తరలించడం ఇదే మొదటిసారని ఆర్బీఐ చెప్తోంది. ఈ బంగారాన్ని ప్రత్యేక విమానంలో స్వదేశానికి రప్పించారు.

**పెరిగిన ఆర్బీఐ బంగారం నిల్వలు..**

కొన్నేళ్లుగా ఆర్బీఐ బంగారాన్ని విపరీతంగా కొనుగోలు చేస్తూ వచ్చింది. ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పుర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ బంగారాన్ని నిల్వ చేస్తుంటుంది. దీంతో 2024మార్చి నాటికి ఆర్‌బీఐ వద్ద 822.1టన్నుల పసిడి నిల్వలు చేరాయి. దీంట్లో దాదాపు సగం అంటే 413.8టన్నులు విదేశాల్లోనే నిల్వ చేసింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తనఖా పెట్టిన 100టన్నుల పసిడిని దేశానికి రప్పించింది. ఆర్థిక సంక్షోభం కుదుటపడిన తర్వాత ఆర్బీఐ బంగారాన్ని కొంటూ పోవడంతో విదేశాల్లో నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంట్లో కొంత మొత్తాన్ని భారత్‌కు తరలించారు.


**పసిడి స్వదేశానికి వచ్చిందిలా..**

ఈ స్థాయిలో విదేశాల నుంచి బంగారాన్ని తరలించడం ఆషామాషి విషయం కాదు. దీనిపై ఆర్బీఐ ఎన్నో నెలలు కసరత్తు చేసింది.




రవాణా, భద్రతాపరమైన అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై కొన్ని నెలలపాటు సంసిద్ధం అయ్యింది. ఆర్థికశాఖ సహా ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమన్వయం ఉండేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించింది. పటిష్ఠ భద్రత మధ్య ప్రత్యేక విమానంలో దేశానికి తీసుకువచ్చింది. ముందుగా ఆర్థికశాఖ నుంచి ఆర్‌బీఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు పొందింది. అన్ని దిగుమతులపై వర్తించే ఐజీఎస్టీ మాత్రం ఆర్బీఐ కట్టక తప్పలేదు. తనఖా పెట్టిన బంగారాన్ని ఈ స్థాయిలో స్వదేశానికి తీసుకురావడంతో ఆర్‌బీఐకి నిర్వహణ వ్యయాలు తగ్గనున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో బంగారం నిల్వ చేసినందుకు చెల్లిస్తున్న రుసుము ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదు.

## ప్రజ్వల్ రేవణ్ణకు ఆరు రోజుల సిట్ కస్టడీ..!



**బెంగుళూరు :** అశ్లీల వీడియోల కేసులో జేడీఎస్ సస్పెండెడ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు కర్ణాటకలోని దిగువ న్యాయస్థానం జూన్ ఆరో తేదీ వరకూ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (ఎస్ఐటీ) కస్టడీ విధించింది. తన ఇంటి పని సహాయకురాలిపై లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపులకు పాల్పడిన కేసులో ప్రజ్వల్ రేవణ్ణను.. విమానంలో విదేశాల నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే పోలీసు అధికారులు అరెస్ట్ చేసి సీఐడీ ఆఫీసుకు తరలించారు. డిప్లమాటిక్ పాస్ పోర్ట్‌పై జర్మనీ రాజధాని బెర్లిన్‌కు వెళ్లిన నెల రోజుల తర్వాత ప్రజ్వల్ రేవణ్ణ తిరిగి స్వదేశానికి చేరుకున్నారు. బెంగళూరు విమానాశ్రయంలో విమానం దిగిన వెంటనే ఆయన్ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత హెచ్డీ దేవెగౌడ మనువడు ప్రజ్వల్ రేవణ్ణ (33) నెల రోజుల పాటు దర్యాప్తు అధికారులు జారీ చేసిన సమన్లను తప్పించుకున్నారు. హసన్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్డీఏ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. బెంగళూరు విమానాశ్రయానికి రాగానే అరెస్ట్ చేసేందుకు వీలుగా మహిళా పోలీసుల టీంకు ఆదేశాలు జారీ చేసింది. ఇదే కేసులో అనుమానితులుగా ఉన్న నవీన్ గౌడ, చేతన్ లను అంతకుముందే సీఐటీ పోలీసు అధికారులు అరెస్ట్ చేశారు. అయితే వారు తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ నుంచి మహిళను లైంగిక వేధింపులకు పాల్పడిన వీడియోలు గల పెన్ డ్రైవ్?లను నవీన్ గౌడ, చేతన్ గౌడ పంపిణీ చేశారన్న కేసులో వారిని అరెస్ట్ చేశారని పోలీసు వర్గాలు తెలిపాయి.


వైసీపీ అంతం
3 రోజులు



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## కృష్ణకు చంద్రబాబు నివాళులు

అమరావతి: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నివాళులర్పించారు. కృష్ణ అనితర సాధ్యమైన నటనతో తెలుగు చలనచిత్ర రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. సినీ అభిమానుల్లో సాహసవంతుడిగా, సహృదయునిగా పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు కొనియాడారు.



# నాగ్‌పూర్ @ 56 డిగ్రీలు!

## పైనే.. భానుడు భగభగ!!

**ఎండలకు 54 మంది మృతి | ఉడుకుతున్న ఉత్తరాది**

దేశవ్యాప్తంగా భానుడు భగభగలతో ఎండలు మంటపుట్టిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో శనివారం రికార్డు స్థాయిలో 56 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ తీవ్రతకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. 24 గంటల్లో దేశవ్యాప్తంగా 54 మందికిపైగా చనిపోయారు. కొద్ది రోజులుగా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో 50 డిగ్రీల సెల్సియస్ దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి.

- పూర్తి కథనం 2లో..

# చూపంతా.. ఎగ్జిట్‌పోల్స్‌వైపే!

- సాయంత్రం 6.30 తరువాత వెల్లడి
- నేటితో ముగుస్తున్న ఎన్నికల పోలింగు
- కేంద్రంలో నరేంద్రమోదీ హ్యాట్రిక్‌పై చర్చ
- చంద్రబాబు నాల్గవసారి సీఎంపైనా అమితాసక్తి
- పరువు కోసం ప్రాయోజిత సర్వేలకు వైసీపీ పాట్లు

దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిషా రాష్ట్రాల అసెంబ్లీలకు ఏడుదశల్లో సాగిన ఎన్నికల పోలింగ్ నేటి సాయంత్రం ఆరు గంటలతో ముగియనుంది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం ఫలితాలు జూన్ 2న, మిగిలిన ఎన్నికల ఫలితాలు జూన్ 4న అధికారికంగా వెల్లడవుతున్నా, చివరి విడత పోలింగ్ పూర్తైన అరగంట వ్యవధిలో ప్రఖ్యాత మీడియా సంస్థలు, చోటామోటా సర్వే సంస్థలు ప్రకటించబోయే ఎగ్జిట్ పోల్స్ కోసం దేశ, రాష్ట్ర ప్రజల్లో ఉత్కంఠ కనిపిస్తోంది. కేంద్రంలో అధికారంలోవున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే హ్యాట్రిక్ కొడుతుందా? జగన్విముక్త నవ్యాంధ్ర లక్ష్యంగా ఏర్పాటైన తెలుగుదేశం -జనసేన -బీజేపీల కూటమికి ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్ని స్థానాలు దక్కనున్నాయి. ఎన్ని స్థానాల రికార్డుతో చంద్రబాబు నాల్గవసారి సీఎం అవుతారు? వైనాట్ వన్ సెవెంటీఫైవ్ అంటూ విర్రవీగిన వైసీపీ ఎన్ని స్థానాలకు దిగజారనుంది? వీటిపై ఎగ్జిట్ పోల్స్ ఇచ్చే రిజల్యూషన్ కోసం ఆంధ్రావని ఆసక్తిగా ఎదురుచూస్తోంది!

- పూర్తి కథనం 3లో..

## పొలిటికల్ పెన్‌కౌంటర్



విదేశీ ప్రయాణానికి షరతులతో కూడిన అనుమతి దొరకడంతో లండన్ వెళ్లిన సీఎం జగన్.. గడువు తీరిపోవడంతో నేడు తాడేపల్లి చేరుకోనున్నారు. వెళ్తూవెళ్తూ గెలుపును ప్రకటించిన జగన్.. ఎగ్జిట్ పోల్స్‌పై ఏం వ్యాఖ్యానిస్తారోనన్న ఆసక్తి పార్టీ వర్గాల్లో కనిపిస్తోంది.

కిందపడిన మీదమాట
మానదుగా.. మన జగ్గడు!
ఫలితాలే వచ్చువరకు
గెలుపుపాటె పాడుతుండు..!!

నవ్యాంధ్రులు చెప్పిరిగా
ఓటుతోటి నీ ఓటమి!
కూటమికే ఎదురునిలువ
సరిపోదుగ ఫ్యాను బలిమి!!

వికృతమూ.. విధ్వంసము
అంతమయ్యె రోజులొచ్చె?
న.మో చంద్ర పవను-గాలి
నవ్యాంధ్రకు ఊపిరిచ్చె!?

తాడేపల్లి గుడారాన్ని
వదలిపోక తప్పదని!
'పోల్స్' లెక్క తేల్చునుగా
'జగనెగ్జిటు'.. ఖాయమని!!

-మహాదేవ

# పోరాడి సాధించిన ఏబీవీ!

- పదవిలో చేరాకే రిటైరైన యోధుడు
- కక్షగట్టిన జగన్‌ను ఎదిరించి ఐదేళ్లుగా పోరాటం
- పోస్టింగ్ ఇవ్వకుండానే పంపించేందుకు ప్రభుత్వం కుట్ర
- బాధ్యతలు చేపట్టి సగౌరవంగా పదవీ విరమణ
- పదవికే విరమణ.. పోరాటానికి కాదని స్పష్టీకరణ



- వివరాలు 4 లో..

## ఓట్ల లెక్కింపు నియమాలను

# క్షుణ్ణంగా తెలుసుకోండి



- కౌంటింగ్ ఏజెంట్లు నియమాలను పట్టించుకోవద్దన్న వైసీపీ
- రూల్స్ ప్రకారమే లెక్కింపు జరిపించమన్న తెదేపా
- కేంద్ర కార్యాలయంలో లెక్కింపు శిక్షణ శిబిరం నిర్వహణ

2

## పోస్టల్ బ్యాలెట్‌పై వైసీపీకి భయమెందుకు?

- నిలదీసిన ఎమ్మెల్సీ అశోక్‌బాబు

4

కౌంటింగ్ ఏజెంట్లపై వ్యాఖ్యలు

## సజ్జలపై క్రిమినల్ కేసు

2

## పోస్టల్ బ్యాలెట్లపై హైకోర్టు తీర్పు నేడు

2

## భూములు ఇవ్వాలని స్వయంగా సీఎస్సే వచ్చి అడిగారు

- ప్రాణం పోయినా ఇచ్చేది లేదన్నాం
- విశాఖలో బాధిత రైతుల ఆవేదన

3

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై గవర్నర్‌ను కలిసిన బీజేపీ బృందం

3

## నేడు తుది దశ పోలింగ్

57 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు

12